# 22. అల్ హజ్ (కాబా యాత్ర) సూరా

## పరిచయం

ఈ సూరా మదీనా కాలానికి చెందిన సూరా. ఇందులో 78 ఆయతులు ఉన్నాయి. ఈ సూరా ప్రారంభ ఆయత్‌లో తీర్పుదినం నాటి భయానక స్థితిగతుల వర్ణన ఉంది. ఆ రోజున ప్రతి ఒక్కరు భయంతో గజగజలాడుతుంటారు. చివరకు కన్న తల్లి తన పాలు త్రాపే శిశువును కూడా మరిచిపోతుంది. ఆ రోజున గర్భంతో ఉన్న స్త్రీలు గర్భస్రావానికి గురవుతారు. ప్రజలు తాగి మత్తులో ఉన్న వారి మాదిరిగా నడుస్తుంటారు. ఈ వివరాలు తెలుపుతూ, మరణానంతరం మళ్ళీ లేపబడడం గురించి ఈ సూరా హెచ్చరిస్తుంది. ఈ విషయమై సందేహాలున్న వారికి కావలసిన రుజువులు చూపుతుంది.

ఈ సూరాలో తీర్పుదినం నాటి ఒక దృశ్యాన్ని వర్ణించడం జరిగింది. అందులో అవిశ్వాసులు అగ్నితో తయారైన దుస్తులు ధరించి ఉంటారు. మరుగుతున్న నీరు వారిపై గ్రుమ్మరించడం జరుగుతుంది. వారిని శిక్షించడానికి లోహపు ముళ్ళ గదలు ఉంటాయి. అయితే సదాచరణలకు కట్టుబడిన విశ్వాసులకు స్వర్గవనాలు లభిస్తాయి. వారికి బంగారంతో, ముత్యాలతో చేసిన ఆభరణాలు లభిస్తాయి. వారు సిల్కు వస్త్రాలు ధరిస్తారు.

సత్యంపై దాడి జరిగినపుడు, ఇస్లామ్ అణచివేతకు గురయినపుడు అల్లాహ్ కోసం పోరాడటం న్యాయబద్ధమని ఈ సూరా విస్పష్టం చేస్తుంది. అల్లాహ్ కోసం పోరాడటమన్నది రక్తపాతం సృష్టించే ఉద్దేశ్యంతో కాదు, చెడును, అణచివేతను ఎదుర్కోవడానికే జరుగుతుందని ఈ సూరా తెలుపుతుంది. అల్లాహ్ ఆగ్రహానికి గురయి నాశనమైన గత జాతుల గురించి కూడా ఈ సూరా ప్రస్తావించింది. తమ చెడుల కారణంగా, ప్రవక్తలను వ్యతిరేకించిన కారణంగా ఆయా జాతులు వినాశాన్ని చవిచూసాయి. ప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను ఉద్దేశించి ప్రజల తిరస్కారాన్ని ఎదుర్కున్నది ఆయన ఒక్కరే కాదని, గత ప్రవక్తలు కూడా ప్రజల తిరస్కారాన్ని ఎదుర్కున్నారని, నూహ్ ప్రవక్త (అస), సాలిహ్ (అస), షుఐబ్ (అస), ఇబ్రాహీమ్ (అస), లూత్ (అస), మూసా(అస)లను కూడా వారి వారి జాతుల ప్రజలు తిరస్కరించారని చెప్పడం జరిగింది.

# 22. అల్ హజ్[1] సూరా

# سُورَةُ الحَجِّ

అవతరణ : మదీనా ఆయతులు : 78

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

**1** ఓ ప్రజలారా! మీ ప్రభువుకు భయ పడండి. నిశ్చయంగా ప్రళయ సమయాన జరిగే ప్రకంపనం మహా (భీకర) విషయం.

يٰٓاَيُّهَا النَّاسُ اتَّقُوْا رَبَّكُمْ ۚ اِنَّ زَلْزَلَةَ السَّاعَةِ شَيْءٌ عَظِيْمٌ ①

**2** ఆనాడు మీరు దాన్ని చూస్తారు... పాలుపట్టే ప్రతి తల్లీ పాలు త్రాగే తన పసికందును మరచిపోతుంది. గర్భవతుల గర్భాలూ పడిపోతాయి. ప్రజలు మైకంలో తూలుతున్నట్లు నీకు కనిపిస్తారు. వాస్తవానికి వారు మైకంలో ఉండరు. అయితే అల్లాహ్ (తరఫున వచ్చిపడిన) విపత్తు అత్యంత తీవ్రంగా ఉంటుంది.[2]

يَوْمَ تَرَوْنَهَا تَذْهَلُ كُلُّ مُرْضِعَةٍ عَمَّآ اَرْضَعَتْ وَتَضَعُ كُلُّ ذَاتِ حَمْلٍ حَمْلَهَا وَتَرَى النَّاسَ سُكٰرٰى وَمَا هُمْ بِسُكٰرٰى وَلٰكِنَّ عَذَابَ اللّٰهِ شَدِيْدٌ ②

1. ఈ సూరా మక్కాలో అవతరించిందా? లేక మదీనాలో అవతరించిందా? అన్న విషయంలో ద్వంద్వాభిప్రాయాలున్నాయి. నిజానికి ఈ సూరాలోని అంశాలనుబట్టి కొంతభాగం మక్కాలో అవతరించినా, మరికొంత భాగం మదీనాలో అవతరించింది. ఖుర్తుబీ కూడా ఈ అభిప్రాయాన్నే వ్యక్తపరిచారు (ఫత్హుల్ ఖదీర్). దివ్య ఖుర్ఆన్‌లోని **'రెండు సజ్దాలు'** గల ఏకైక సూరా కూడా ఇదే.

2. ప్రళయదినం ఎంత భయంకరంగా ఉంటుందో ఈ ఆయతులో చెప్పబడింది. ఆనాడు ఎవరి గొడవ వారిదే. అందరూ తీవ్రమైన కలవరానికి లోనవుతారు. భయంతో బెంబేలెత్తిపోతారు. కడుపు చించుకుపుట్టిన పసిబిడ్డల్ని సయితం తల్లి మరచిపోతుంది. గర్భిణీలకు గర్భస్రావం అయిపోతుంది. ఇది ప్రళయానికి ముందు పరిస్థితి. దాంతోనే ప్రపంచమంతా నాశనమైపోతుంది. లేదా ప్రళయం తరువాత – సమాధుల నుంచి లేచి మహ్షర్ మైదానంలో సమావేశమవుతున్నప్పుడు ఈ పరిస్థితి ఏర్పడవచ్చు. చాలామంది వ్యాఖ్యాతలు మొదటి అభిప్రాయాన్నే సమర్థించారు. కొద్దిమంది మాత్రం రెండవ అభిప్రాయం వైపుకు మొగ్గారు. దీనికి అనుకూలంగా వారు హదీసులను కూడా ఉదాహరించారు. ఉదాహరణకు : అల్లాహ్ ఆదం (అలైహిస్సలాం) నుద్దేశించి, నీ సంతతిలో వెయ్యికి 999 మంది చొప్పున నరకవాసులను వేరు చెయ్యి అనంటాడు.

**3** జ్ఞానం లేకపోయినా అల్లాహ్ విషయంలో వాదించేవారు కూడా జనులలో కొందరున్నారు. వారు తలబిరుసు అయిన ప్రతి షైతానును అనుసరిస్తారు.[3]

وَمِنَ النَّاسِ مَنْ يُّجَادِلُ فِى اللّٰهِ بِغَيْرِ عِلْمٍ وَّيَتَّبِعُ كُلَّ شَيْطٰنٍ مَّرِيْدٍ ۝٣

**4** అతని సహవాసం చేసిన వారినల్లా అతను అపమార్గం పట్టించి, అతన్ని అగ్ని శిక్ష వైపుకు తీసుకుపోతాడని అతని గురించి (విధివ్రాతలో) రాయబడి ఉంది.[4]

كُتِبَ عَلَيْهِ اَنَّهٗ مَنْ تَوَلَّاهُ فَاَنَّهٗ يُضِلُّهٗ وَيَهْدِيْهِ اِلٰى عَذَابِ السَّعِيْرِ ۝٤

ఈ మాట వినగానే గర్భవతుల గర్భాలు పడిపోతాయి. పసిపిల్లలు సయితం బాధతో ముసలివారైపోతారు. ప్రజలంతా మత్తులో మునిగి ఉన్నట్లు కానవస్తారు. నిజానికి వారు తప్పతాగి ఉండరు. ఆ విపత్తుకు వారి పరిస్థితి ఆ విధంగా తయారవుతుంది.

మహాప్రవక్త (స) ద్వారా ఈ సంగతి తెలుసుకున్న ప్రియసహచరులు (రజి) నిర్ఘాంత పోయారు. వారి ముఖకవళికలు మారిపోయాయి. అప్పుడు మహాప్రవక్త (స) వారినుద్దేశించి “(కలవరపడకండి) ఆ 999 మంది యాజూజు మాజూజుల వర్గానికి చెందినవారై ఉంటారు. మీలోని ఒక్కడు మాత్రమే ఆ కోవకు చెందినవాడై ఉంటాడు. మీరు (సంఖ్యాపరంగా) జనులలో తెల్లని ఎద్దు దేహంపై నల్లటి వెంట్రుకలు ఎలా ఉంటాయో లేక నల్లరంగు ఎద్దు దేహంలో తెల్లటి వెంట్రుకలు ఎలా ఉంటాయో అలా ఉంటారు. స్వర్గవాసులలో మీరు నాల్గోవంతో, మూడో వంతో ఉంటారు లేక సగానికి సగం ఉంటారని నేను ఆశిస్తున్నాను.” ఈ మాట వినగానే ప్రియసహచరులు (రజి) సంతోషాతిశయంతో ‘అల్లాహు అక్బర్’ అని నినదించారు (సహీహ్ బుఖారీ – అల్ హజ్ సూరా వ్యాఖ్యానం).

మొదటి అభిప్రాయం కూడా తేలిగ్గా కొట్టివేయదగినది కాదు. కొన్ని బలహీన హదీసులు ఈ అభిప్రాయాన్ని కూడా సమర్థిస్తున్నాయి. రెండు అభిప్రాయాలు కూడా సరైనవే కావచ్చు. ఎందుకంటే ప్రళయ ఘడియకు ముందూ, ఆ తరువాత కూడా ప్రజల పరిస్థితి ఇంచుమించు ఒకేవిధంగా ఉంటుంది.

3. అంటే – మరణించిన వారిని అల్లాహ్ మళ్లీ బ్రతికించడనీ, అల్లాహ్‌కు సంతానం ఉందని వారు పిడివాదనకు దిగి తమను షైతాన్ అనుయాయులుగా నిరూపించుకున్నారు.

4. షైతాన్ విషయంలో దేవుడు రాసిపెట్టినది ఇదే. తన వెనుక వచ్చిన వారందరినీ వాడు దారి తప్పించి, నరకాగ్నికి ఆహుతి చేస్తాడు.

يَا أَيُّهَا النَّاسُ إِن كُنتُمْ فِي رَيْبٍ مِّنَ الْبَعْثِ فَإِنَّا خَلَقْنَاكُم
مِّن تُرَابٍ ثُمَّ مِن نُّطْفَةٍ ثُمَّ مِنْ عَلَقَةٍ ثُمَّ مِن
مُّضْغَةٍ مُّخَلَّقَةٍ وَغَيْرِ مُخَلَّقَةٍ لِّنُبَيِّنَ لَكُمْ ۚ وَنُقِرُّ

**5** ఓ ప్రజలారా! ఒకవేళ మరణానంతర జీవితం గురించి మీకేదన్నా సందేహం ఉంటే కాస్త ఆలోచించండి... మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, ఆ తరువాత వీర్యపు బొట్టుతో, ఆపైన గడ్డకట్టిన రక్తంతో, అటు పిమ్మట మాంసపు ముద్దతో చేశాము – అప్పటికి అది రూపం కలది గానూ, రూపరహితంగానూ ఉన్నది.[5] మేము మీకు స్పష్టంగా తెలియజెప్పేందుకు (ఇదంతా చేస్తున్నాము).[6] మరి మేము కోరిన దానిని నిర్ధారిత సమయం వరకు మాతృగర్భాలలో ఉంచుతున్నాము.[7] ఆ తరువాత మిమ్మల్ని శైశవ దశలో బయటికి తెస్తాము – మరి మీరు నిండు

5. గర్భాశయంలోకి వెళ్ళిన వీర్యకణం నలభై రోజుల తరువాత **అలఖ(عَلَقَة)** (నెత్తుటి గడ్డ)గా మారుతుంది. ఆ తరువాత అది **ముజ్‌గ (مُضْغَة)** (మాంసపు ముద్ద)గా రూపాంతరం చెందుతుంది. ఆ తరువాత **ముఖల్లఖ( مُخَلَّقَة )** గా తయారవుతుంది. అంటే పరిపూర్ణమైన శిశువు ఆకారాన్ని సంతరించుకుంటుంది. ఆ తరువాత అందులో ప్రాణం పోయబడుతుంది. ఈ ప్రక్రియ అంతా పూర్తయిన పిమ్మట ఆ శిశువును మాతృ గర్భం నుంచి బయటపడవెయ్యటం జరుగుతుంది. ఒక్కోసారి – దీనికి భిన్నంగా – సంపూర్ణ శిశువు ఆకారం సంతరించుకోకముందే గర్భస్రావం జరిగి పోతుంది. సహీహ్ హదీసులలో కూడా మాతృగర్భాలలోని – గర్భస్థ – శిశువుల స్థితిగతులు వివరించబడ్డాయి. ఉదాహరణకు : ఒక ప్రామాణిక హదీసు ప్రకారం వీర్యబిందువు 40 రోజుల తరువాత ఘనీభవించిన రక్తంగా మారుతుంది. ఆ తరువాత నలభై రోజులకు మాంసపు కండగా తయారవుతుంది. ఆ తరువాత దేవుని తరఫున ఒక దైవదూత వచ్చి ప్రాణం పోస్తాడు. అంటే నాలుగు మాసాల తరువాత కడుపులోని నలుసు ప్రాణం పోసుకుంటుంది. దాంతో అది సంపూర్ణ ఆకారం గల శిశువు అవుతుంది (సహీహ్ బుఖారీ – కితాబుల్ అంబియా వ కితాబుల్ ఖద్ర్; ముస్లిం – కితాబుల్ ఖద్ర్....)

6. ఈ విధంగా మేము మీకు మా శక్తియుక్తులను, కార్యదక్షతను విడమరచి చెబుతున్నాము.

7. అంటే – గర్భస్రావం కాకూడని వాటిని మేము మాతృగర్భాలలో నిలిపి ఉంచాము.

فِي الْأَرْحَامِ مَا نَشَاءُ إِلَىٰ أَجَلٍ مُسَمًّى ثُمَّ
نُخْرِجُكُمْ طِفْلًا ثُمَّ لِتَبْلُغُوا أَشُدَّكُمْ ۖ وَمِنْكُمْ مَنْ
يُتَوَفَّىٰ وَمِنْكُمْ مَنْ يُرَدُّ إِلَىٰ أَرْذَلِ الْعُمُرِ لِكَيْلَا
يَعْلَمَ مِنْ بَعْدِ عِلْمٍ شَيْئًا ۚ وَتَرَى الْأَرْضَ
هَامِدَةً فَإِذَا أَنْزَلْنَا عَلَيْهَا الْمَاءَ اهْتَزَّتْ
وَرَبَتْ وَأَنْبَتَتْ مِنْ كُلِّ زَوْجٍ بَهِيجٍ ⑤

యౌవనానికి చేరుకోవటానికి! మీలో కొందరు (యుక్త వయస్సుకు చేరక ముందే) మృత్యువుకు గురిచేయబడతారు.[8] మరి కొందరు అన్నీ తెలిసి ఉండి కూడా ఏమీ గ్రహించలేనంత నికృష్టమైన వయస్సుకు చేర్చబడతారు.[9] నేల ఎండిపోయి (బీడుగా మారి) ఉండటం నువ్వు చూస్తావు. ఆ తరువాత మేము దానిపై వర్షం కురిపించగానే అది పులకిస్తుంది, ఉబికి వస్తుంది, అన్ని రకాల మనోహర మైన మొక్కలను మొలకెత్తిస్తుంది.[10]

8. నిండు యౌవనం అంటే మనిషి దేహదారుఢ్యం ఉచ్ఛస్థితికి చేరటంతో పాటు అతని బుద్ధిజ్ఞానాలు, తెలివితేటలు పరిపక్వం కావటం అని భావం. సాధారణంగా 30 నుంచి 40 ఏళ్ల ప్రాయంలో మనిషి ఈ స్థితికి చేరుకుంటాడు. కాని ఈ స్థితికి చేరక ముందే కొందరు మృత్యువాతన పడతారు.

9. నికృష్టమైన వయస్సు అంటే మనిషికి తన పంచేంద్రియాలపై పట్టులేకుండా పోయే హీనాతి హీనస్థితి. ఆ వార్ధక్యదశలో అతని జ్ఞాపకశక్తి క్షీణించిపోతుంది. బుద్ధి మందగిస్తుంది. మతి చలిస్తుంది. మనుషుల్ని గుర్తుపట్టగలిగినా సరిగ్గా వ్యక్తం చేయలేని దయనీయ స్థితి ఏర్పడుతుంది. దీన్నే అత్తీన్ సూరాలో **సుమ్మ రదద్‌నాహు అస్ఫల సాఫిలీన్** (మరి మేమతన్ని అతి నికృష్టజీవిగా మార్చివేశాము) అని చెప్పటం జరిగింది.

10. మరణానంతర జీవితం ఎలా సంభవమో విశదీకరించటానికి అల్లాహ్ చూపే రెండవ నిదర్శనం ఇది. మొదటి నిదర్శనంలో దేవుడు అత్యంత అల్పమైన వీర్యపు బిందువు ద్వారా ఒక సంపూర్ణ ఆకారంగల, అందమైన మానవుణ్ణి మలచి ఆవిష్కరించాడు. మరి అతన్ని జీవితంలో వివిధ దశల గుండా సాగిపోయేలా చేసి అత్యంత నికృష్టమైన ముసలితనానికి చేర్చాడు. అప్పటికి అతని మేధ ముకుళించుకుపోతుంది. శరీరంలో నిస్సత్తువ ఆవరిస్తుంది. పండు ముసలిగా మారిన మనిషి పసిపిల్లాడులా ప్రవర్తిస్తాడు. నిత్య జీవితంలో ఇలాంటి ఎన్నో ఉపమానాలను మనకు చూపిస్తున్న సృష్టికర్తకు చనిపోయిన వారిని మళ్లీ బ్రతికించటం కష్టతరమా? ఏమాత్రం కాదు. ఇప్పటికీ మీకు ఇంకా సందేహం ఉంటే మృతభూమిగా మారిన బంజరు నేలను చూడండి. ఆకాశం నుంచి వర్షం కురవగానే అది ఒక్కసారిగా పునరుజ్జీవనం పొందుతుంది. బీటలు వారిన నేల పచ్చగా మారి నవనవలాడుతుంది. రకరకాల పండ్లను,

6 అల్లాహ్‌యే సత్యం గనక, మృతులను తిరిగి బ్రతికించేవాడు ఆయనే గనక, అన్నింటిపై ఆయనే అధికారం కలవాడు గనక ఇదంతా జరుగుతోంది సుమా!

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ هُوَ الْحَقُّ وَاَنَّهٗ يُحْيِ الْمَوْتٰى وَاَنَّهٗ عَلٰى كُلِّ شَیْءٍ قَدِيْرٌ ۙ﴿٦﴾

7 (దీంతోపాటు) ప్రళయం రావటం తథ్యం. అందులో సందేహానికి ఆస్కారమే లేదు. నిశ్చయంగా అల్లాహ్ సమాధులలో ఉన్నవారిని తిరిగి లేపుతాడు.

وَّاَنَّ السَّاعَةَ اٰتِيَةٌ لَّا رَيْبَ فِيْهَا ۙ وَاَنَّ اللّٰهَ يَبْعَثُ مَنْ فِى الْقُبُوْرِ ﴿٧﴾

8 మరి కొంతమంది (కూడా ఉన్నారు. వారు) జ్ఞానంగానీ, మార్గదర్శకత్వంగానీ, జ్యోతిర్మయమైన గ్రంథంగానీ లేకుండానే అల్లాహ్ విషయంలో పిడివాదన చేస్తారు.

وَمِنَ النَّاسِ مَنْ يُّجَادِلُ فِى اللّٰهِ بِغَيْرِ عِلْمٍ وَّلَا هُدًى وَّلَا كِتٰبٍ مُّنِيْرٍ ۙ﴿٨﴾

9 గర్వంతో ప్రక్కకు తిరిగిపోయేవాడై![11] అల్లాహ్ మార్గం నుంచి (ప్రజలను) తప్పించాలన్నది వాడి ఉద్దేశం. వాడికి ప్రపంచంలోనూ పరాభవం ఉంది, ప్రళయదినాన కూడా మేమతన్ని నరకంలో దహించివేసే యాతనను చవిచూపిస్తాము.

ثَانِیَ عِطْفِهٖ لِيُضِلَّ عَنْ سَبِيْلِ اللّٰهِ ؕ لَهٗ فِى الدُّنْيَا خِزْىٌ وَّنُذِيْقُهٗ يَوْمَ الْقِيٰمَةِ عَذَابَ الْحَرِيْقِ ﴿٩﴾

ఆహారధాన్యాలను పండిస్తుంది. పాడుబడిన భూమినుంచి మొక్కల్ని మొలకెత్తించినట్లే అల్లాహ్ ప్రళయదినాన సమాధులలోని మృతులను బ్రతికించి లేపుతాడు.

ఒకసారి ప్రవక్త ప్రియ సహచరులొకరు దైవప్రవక్త (స)తో, 'అల్లాహ్ మనుషులను మళ్లీ ఎలా బ్రతికిస్తాడో ఉదాహరణ ద్వారా తెలియజేస్తారా?!' అని కోరగా, "నువ్వు ఎప్పుడైనా బంజరు ప్రదేశం గుండా సాగిపోవటం, ఆ తరువాత కొంతకాలానికి అది పచ్చగా కళకళలాడుతూ ఉండటం చూశావా?" అని ఆయన (స) ప్రశ్నించారు. దానికాయన 'అవును, చూశాను' అన్నారు. "సరిగ్గా అలాగే మనుషులు తిరిగిలేస్తార"ని మహాప్రవక్త (సఅసం) వివరించారు. (ముస్నదె అహ్మద్ – సంపుటి : 4, పేజీ – 11; ఇబ్ను మాజ – పీఠిక, హదీసు నెంబరు – 180)

11. ఏ ఆధారమూ లేకుండా మొండిగా వాదించేవాడు సాధారణంగా సంస్కారవంతుడై ఉండడు. అలాంటివాడు గర్విష్ఠి అయి ఉంటాడు. సత్యానికి, ధర్మానికి విరోధి అయి వుంటాడు. అందుకే వాడు నోటికొచ్చినట్లు మాట్లాడేసి భుజాలు ఎగురవేసుకుంటూ

10 నీ చేతులు ముందుగా చేసి పంపుకున్న కర్మల మూలంగా నీకీ ఖర్మ పట్టింది. అల్లాహ్ తన దాసులకు అన్యాయం చేసే వాడు కాడన్న సంగతిని తెలుసుకోండి.

ذٰلِكَ بِمَا قَدَّمَتْ يَدٰكَ وَاَنَّ اللّٰهَ لَيْسَ بِظَلَّامٍ لِّلْعَبِيْدِ ۝١٠

11 ప్రజలలో మరికొంతమంది (కూడా ఉన్నారు. వారు) ఎలాంటివారంటే, వారు ఒక అంచున (నిలబడి) అల్లాహ్‌ను ఆరాధి స్తుంటారు. తమకేదన్నా లాభం కలిగితే ఆరాధన పట్ల సంతృప్తి చెందుతారు. ఏదన్నా ఆపద వచ్చిపడితే మాత్రం అప్పటి కప్పుడే ముఖం తిప్పుకునిపోతారు.[12] అలాంటి వారు ప్రాపంచికంగానూ, పార లౌకికం గానూ నష్టపోయారు. స్పష్టంగా నష్ట పోవటం అంటే ఇదే.

وَمِنَ النَّاسِ مَنْ يَّعْبُدُ اللّٰهَ عَلٰى حَرْفٍ ۚ فَاِنْ اَصَابَهٗ خَيْرُ ِۨاطْمَاَنَّ بِهٖ ۚ وَاِنْ اَصَابَتْهُ فِتْنَةُ ِۨانْقَلَبَ عَلٰى وَجْهِهٖ ۚ خَسِرَ الدُّنْيَا وَالْاٰخِرَةَ ۗ ذٰلِكَ هُوَ الْخُسْرَانُ الْمُبِيْنُ ۝١١

వెనుతిరిగి పోతాడు. అటువంటి తలబిరుసుల గురించి దివ్య ఖుర్‌ఆన్ ఇతరచోట్ల ఇలా ప్రస్తావించింది – (1). "తన చెవులలో చెవుడు ఉన్నట్లుగా వాడు గర్వంతో ముఖాన్ని తిప్పుకుంటాడు." (లుఖ్మాన్ – 7).

(2). "వారు తల విదిలిస్తారు" (మునాఫిఖూన్ – 5).

(3). "వాడు విర్రవీగుతాడు, వెనక్కి మరలిపోతాడు" (బనీ ఇస్రాయీల్ – 83).

12. **'హర్ఫున్'** ( حَرْفٍ ) అంటే అంచు, ఒడ్డు అని అర్థం. ఈ అంచులపై నిలబడి ఉండేవాడు నిలకడలేని వాడై ఉంటాడు. మతధర్మం విషయంలో సంశయానికి, సందిగ్ధానికి లోనై ఉన్న వ్యక్తి కూడా ఇంతే. ధర్మావలంబనలో అతనికి నిలకడ ప్రాప్తించదు. ఎందుకంటే పొద్దస్తమానం ప్రాపంచిక ప్రయోజనాలు పొందటం అతని ముఖ్యోద్దేశం అయి ఉంటుంది. ప్రయోజనాలు చేకూరినంతసేపూ ధర్మాన్ని అంటిపెట్టుకుని ఉంటాడు. అన్యథా తన పూర్వీకుల మతం వైపుకు మరలిపోతాడు. తద్భిన్నంగా నిజమైన, నికార్సయిన ముస్లింలు దృఢవిశ్వాసం కలిగి ఉంటారు. వారు కలిమి లేములను, ఎత్తుపల్లాలను చూడకుండానే ధర్మంలోకి వస్తారు. సర్వకాల, సర్వావస్థల్లో ధర్మంపై స్థయిర్యాన్ని కనబరుస్తారు. దైవానుగ్రహాలు ప్రాప్తించినపుడు దైవానికి కృతజ్ఞతలు తెలుపుకుంటారు. కష్టాలెదురైనపుడు ఓర్పు వహిస్తారు. ఈ ఆయతు అవతరణా నేపథ్యంలో ఒక వ్యక్తి వృత్తాంతం ఉంది. అతను మదీనా నగరానికి వస్తాడు. తనకు సంతానం కలిగితే, పశువులలో సమృద్ధి జరిగితే ఈ

**12** మరి వారు అల్లాహ్‌ను వదలి తమకు నష్టంగానీ, లాభంగానీ కలిగించలేని వారిని మొరపెట్టుకోసాగుతారు. చాలా దూరపు అపమార్గం అంటే ఇదే.

يَدْعُوْا مِنْ دُوْنِ اللّٰهِ مَا لَا يَضُرُّهٗ وَمَا لَا يَنْفَعُهٗ ۭ ذٰلِكَ هُوَ
الضَّلٰلُ الْبَعِيْدُ ﴿١٢﴾

**13** ఎవరి నష్టం (కీడు) అతని లాభం కన్నా చేరువలో ఉన్నదో అలాంటి వానిని వారు వేడుకుంటున్నారు. ముమ్మాటికీ అలాంటివాడు మహా చెడ్డ సహాయకుడు, మహాచెడ్డ స్నేహితుడు.[13]

يَدْعُوْا لَمَنْ ضَرُّهٗٓ اَقْرَبُ مِنْ نَّفْعِهٖ ۭ لَبِئْسَ الْمَوْلٰى
وَلَبِئْسَ الْعَشِيْرُ ﴿١٣﴾

---

ధర్మం (ఇస్లాం) చాలా మంచి ధర్మం అని అంటాడు. తాననుకున్నట్లుగా జరగకపోతే ఈ ధర్మం ముదనష్టపు ధర్మం అంటాడు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆనాడు కొత్తగా ఇస్లాం స్వీకరించిన అరబ్బు పల్లెవాసుల్లో ఈ అవలక్షణం ఉండేది. (ఫత్‌హుల్ బారీ)

13. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల ప్రకారం **'వేడుకుంటున్నారు'** (యద్‌వూ) అనే పదం 'పలుకుతున్నారు' (యఖూల్) అన్న భావంలో వాడబడింది. దైవేతరులను పూజించే భక్తులు తీర్పుదినాన తమ మిథ్యా దైవాలను గురించి, 'వాడు చాలా చెడ్డ సంరక్షకుడు, చెడ్డ స్నేహితుడు' అని పలుకుతారు. అంటే తమ ఆశా సౌధం ఆనాడు కుప్పకూలిపోయిన తరువాత వారి నోట అప్రయత్నంగా ఈ మాటలు వెలువడతాయి. వారు దైవాగ్రహం నుంచి తమను కాపాడతారనీ, తమ కొరకు సిఫారసు చేస్తారని ఇప్పటి వరకూ నమ్మేవారు. కాని తీరా ఆ కీలక సమయం వచ్చినప్పుడు ఆ బూటకపు దేవుళ్ళు నిస్సహాయులుగా ఉండిపోయారు. పైగా తమ భక్తులతోపాటు వాళ్లు కూడా నరకానికి ఇంధనంగా మారారు. కష్టకాలంలో ఆదుకునే వాడే నమ్మదగ్గ నేస్తం అవుతాడు. కాని స్వయంగా దైవాగ్రహానికి పాత్రులయ్యేవారు ఇంకా ఇతరులకు ఏం సహాయం చేస్తారు? అందుకే వారు చాలా చెడ్డ సంరక్షకులుగా, చెడ్డ స్నేహితులుగా అభివర్ణించబడ్డారు. వారికి చేసే పూజలు ప్రయోజనం చేకూర్చటం అటుంచి, ఆసాంతం హానికరంగానే పరిణమించాయి. అలాంటి వారినుద్దేశించి ఇంకోచోట ఇలా అనబడింది: "నిశ్చయంగా ఇప్పుడు మేమో (అల్లాహ్‌ను విశ్వసించేవారో) లేక మీరో (తిరస్కారులో) – ఎవరో ఒకరు మాత్రమే సన్మార్గంలో ఉన్నాము లేదా స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉన్నాము" (సబా – 24). వాస్తవానికి అల్లాహ్‌ను విశ్వసించే వారు మాత్రమే సన్మార్గంలో ఉంటారు. కాని ఈమాట సూటిగా చెప్పే బదులు ఆలోచింపజేసే విధంగా "ఎవరి నష్టం (కీడు) అతని లాభం కన్నా చేరువలో ఉన్నదో" అని చెప్పబడింది. శ్రోతల మనోమస్తిష్కాలకు పదును పెట్టడం దీని అసలు ఉద్దేశం.

**14** విశ్వసించి, మంచిపనులు చేసిన వారిని అల్లాహ్ సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. అల్లాహ్ అనుకున్న దాన్ని చేసి తీరుతాడు.

اِنَّ اللّٰهَ يُدْخِلُ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ جَنّٰتٍ
تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ ۭ اِنَّ اللّٰهَ يَفْعَلُ مَا يُرِيْدُ ﴿١٤﴾

**15** అల్లాహ్ ప్రపంచంలోనూ, పరలోకంలోనూ తన ప్రవక్తకు సహాయం చేయడని తలపోసేవాడు పైనుంచి ఒక త్రాడును కట్టి తన మెడకు ఉరేసుకొని వేలాడాలి. ఆ తరువాత తన ఈ ఉపాయం వల్ల తన కసి తీరిందేమో చూసుకోవాలి.[14]

مَنْ كَانَ يَظُنُّ اَنْ لَّنْ يَّنْصُرَهُ اللّٰهُ فِي الدُّنْيَا
وَالْاٰخِرَةِ فَلْيَمْدُدْ بِسَبَبٍ اِلَى السَّمَاۗءِ ثُمَّ لْيَقْطَعْ
فَلْيَنْظُرْ هَلْ يُذْهِبَنَّ كَيْدُهٗ مَا يَغِيْظُ ﴿١٥﴾

**16** ఈ విధంగా మేము ఈ ఖుర్ఆన్‌ను సుస్పష్టమైన సూచనలతో అవతరింపజేశాము. అల్లాహ్ తాను కోరిన వారికి (మాత్రమే) సన్మార్గ భాగ్యం ప్రసాదిస్తాడు.

وَكَذٰلِكَ اَنْزَلْنٰهُ اٰيٰتٍۢ بَيِّنٰتٍ ۙ وَّاَنَّ اللّٰهَ يَهْدِيْ مَنْ يُّرِيْدُ ﴿١٦﴾

**17** విశ్వాసులు, యూదులు, సాబియీనులు, క్రైస్తవులు, మజూసీలు,[15] బహుదైవారాధకులు[16] – వీరందరి మధ్యా

اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَالَّذِيْنَ هَادُوْا وَالصّٰبِـِٕيْنَ وَالنَّصٰرٰى
وَالْمَجُوْسَ وَالَّذِيْنَ اَشْرَكُوْٓا ڰ اِنَّ اللّٰهَ يَفْصِلُ بَيْنَهُمْ يَوْمَ الْقِيٰمَةِ ۭ

14. విద్వాంసులు ఈ ఆయతుకు రెండు అర్థాలు చెప్పారు : 1. దేవుడు తన ప్రవక్త (సఅసం)కు అండగా నిలువరాదని కోరుకునేవాడు కూడా ఉన్నాడు. ఎందుకంటే దైవప్రవక్త (స) ప్రాబల్యం పెరిగితే అతను ఓర్వలేడు. అలాంటివాడు తన ఇంటి దూలానికి త్రాడును కట్టి తన మెడకు ఉరేసుకోమనండి. అలా చేయటం వల్ల అతనిలోని అక్కసు, ఓర్వలేనితనం దూరమవుతాయేమో చూసుకోమనండి. 2. రెండవ అర్థం : దైవప్రవక్త (సఅసం)కు అనుదినం పెరుగుతున్న ఆదరణను చూసి అసూయతో రగిలిపోయేవాడు చేతనైతే ఒక త్రాడు సహాయంతో ఆకాశానికి ఎక్కమనండి. ఆకాశం నుంచి మహాప్రవక్త (స)కు 'వహీ' రూపంలో అందే సహాయాన్ని ఇకమీదట అందకుండా చేయమనండి. కనీసం ఆ విధంగానయినా అతని గుండె మంట చల్లారుతుందేమో ప్రయత్నించి చూడమనండి.

ఇమామ్ ఇబ్నె కసీర్ మొదటి భావార్థానికి ప్రాధాన్యతనివ్వగా ఇమామ్ షౌకానీ రెండవ భావార్థం వైపుకు మొగ్గారు. నేపథ్యం దృష్ట్యా రెండవ అభిప్రాయమే చాలా వరకు అతుకుతుంది.

అల్లాహ్ ప్రళయదినాన తప్పకుండా తీర్పు చేస్తాడు.[17] నిశ్చయంగా అల్లాహ్ అన్నింటికీ సాక్షిగా ఉన్నాడు.[18]

إِنَّ اللَّهَ عَلَىٰ كُلِّ شَيْءٍ شَهِيدٌ ﴿١٧﴾

**18** ఆకాశాలలో ఉన్నవారూ, భూలోక వాసులు, సూర్యచంద్రులూ, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు,[19]

أَلَمْ تَرَ أَنَّ اللَّهَ يَسْجُدُ لَهُ مَن فِي السَّمَاوَاتِ وَمَن فِي الْأَرْضِ

15. మజూసీలు అంటే అగ్ని పూజారులు. వారు ఈరాన్ ప్రాంతంలో అధికంగా ఉండేవారు. వారు మౌలికంగా ఇద్దరు దేవుళ్ళను నమ్ముతారు. వారిలో ఒకరు చీకటికి కర్త అనీ, మరొకరు వెలుగుకు అధిపతి అని వాళ్లు భావించేవారు. ఒక దేవుణ్ణి 'అహర్‌మన్'గా, ఇంకొక దేవుణ్ణి 'యజ్దా'గా వ్యవహరిస్తారు.

16. అపమార్గానికి గురైన వివిధ తెగలతోపాటు, అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టేవారంతా ఈ కోవలోకి వచ్చేస్తారు.

17. అంటే ఎవరు సత్యవంతులు? ఎవరు మిథ్యావాదులు? అన్న విషయాన్ని అల్లాహ్ తన అంతిమ గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా తెలియజేశాడు. అంతిమ దైవప్రవక్త (సఅసం) కూడా ఈ విషయాన్ని విడమరచి చెప్పడానికే పంపబడ్డారు. సత్యధర్మం (ఇస్లాం) ఇతర ధర్మాలన్నింటిపై ఆధిక్యతను కలిగి ఉండాలన్నది అసలు దీని ఉద్దేశం (అల్ ఫతహ్ – 28). కాని ఈ ఆయతులో పేర్కొనబడిన 'తీర్పు' అంటే మిథ్యావాదులకు తీర్పుదినాన అల్లాహ్ వినిపించే శిక్ష అన్నమాట! ఈ శిక్షను బట్టి కూడా సన్మార్గగాములెవరో, దుర్మార్గులెవరో స్పష్టమైపోతుంది.

18. ఈ తీర్పు కూడా కేవలం దేవుని తిరుగులేని అధికారాల ఆధారంగా జరగదు. న్యాయం ప్రాతిపదికపైనే తీర్పు జరుగుతుంది. ఎందుకంటే అల్లాహ్‌కు ప్రతిదీ తెలుసు. ఆయన తన దాసుల పోకడలను కనిపెట్టుకుని ఉన్నాడు.

19. కొంతమంది ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతలు ఏమంటారంటే; భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువులూ – తమకు ఇష్టం ఉన్నా లేకపోయినా – దైవవిధేయతకు కట్టుబడి ఉన్నాయి. దైవాజ్ఞలను ఎదిరించే ధైర్యం వేటికీ లేదు. ఇక్కడ 'సజ్దా' (సాష్టాంగ ప్రణామం) అంటే భావం ఇదే! అంతేగాని సాధారణంగా మనుషులు ఆరాధన నిమిత్తం చేసే సజ్దా కాదు.

మరికొంతమంది వ్యాఖ్యాతలు 'సజ్దా' అన్న పదాన్ని పై అర్థంలో కాకుండా వాస్తవిక అర్థంలోనే తీసుకున్నారు అంటే సృష్టిలోని ప్రతి వస్తువూ తనదైన రీతిలో విశ్వ ప్రభువుకు సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేస్తోందని వారు వివరించారు. ఉదాహరణకు: 'ఆకాశాలలో ఉన్నవారు' అంటే దైవదూతలు అనీ, 'భూమిలో ఉన్నవారు' అంటే అన్నిరకాల వృక్షజాలు, జంతుజీవులు, మానవులు, జిన్నులు తదితర వస్తువులు అని

وَالشَّمْسُ وَالْقَمَرُ وَالنُّجُومُ وَالْجِبَالُ وَالشَّجَرُ وَالدَّوَابُّ
وَكَثِيرٌ مِّنَ النَّاسِ ۖ وَكَثِيرٌ حَقَّ عَلَيْهِ الْعَذَابُ ۗ وَمَن يُهِنِ
اللَّهُ فَمَا لَهُ مِن مُّكْرِمٍ ۚ إِنَّ اللَّهَ يَفْعَلُ مَا يَشَاءُ ۩ ﴿١٨﴾

السجدة ٢

చాలామంది మనుషులు[20] కూడా అల్లాహ్ ముందు మోకరిల్లడాన్ని నువ్వు గమనించటం లేదా? (దైవ) శిక్షకు అర్హులైన వారు కూడా చాలా మంది ఉన్నారు.[21] అల్లాహ్ పరాభవం పాల్జేసిన వానిని ఎవరూ ఆదరించరు.[22] అల్లాహ్ తాను కోరినదాన్ని చేస్తాడు.

భావం. వారంతా (అవన్నీ) తమ తమ రీతిలో సాష్టాంగపడి, తమ సృష్టికర్తను కీర్తిస్తున్నాయి. "ఆయన పవిత్రతను కొనియాడని, ఆయన స్తోత్రం చేయని వస్తువంటూ లేదు" (బనీ ఇస్రాయీల్- 44). సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలను ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించటం గమనించదగిన విషయం. ఎందుకంటే ఆ కాలంలో ముష్రిక్కులు వాటిని పూజించే వారు. ఈ నేపథ్యంలో అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి : సూర్యచంద్రులు, నక్షత్రాదులు మాకు సాష్టాంగపడుతుండగా మీరు వాటి ముందు మోకరిల్లుతున్నారా? మీరు ఎట్టి పరిస్థితిలోనూ వాటి ముందు మోకరిల్లకండి. మిమ్మల్నీ, మీతోపాటు సూర్యచంద్రుల్ని కూడా పుట్టించిన సర్వసృష్టికర్త ముందే సాష్టాంగపడండి. (హామీమ్ సజ్దా : 37)

సహీహ్ హదీసులో హజ్రత్ అబూజర్ (రజి) ఇలా అంటున్నారు : "సూర్యుడు ఎక్కడికెళతాడో తెలుసా?" అని మహాప్రవక్త (సఅసం) వారు నన్నడిగారు. 'దైవానికి, దైవప్రవక్త (స)కే బాగా తెలుసు' అని నేనన్నాను. "సూర్యుడు (పొద్దు గూకగానే) దైవసింహాసనం క్రిందికి వెళ్ళి సాష్టాంగప్రణామం చేస్తాడు. అప్పుడతనికి మళ్లీ (ఉదయించమని) ఆజ్ఞాపించబడుతుంది. చివరకు ఒక సమయం ఆసన్నమవుతుంది – అప్పుడతనికి, "వచ్చిన చోటికే వెళ్ళిపో" అని ఆదేశించబడుతుంది. (సహీహ్ బుఖారీ – బద్వుల్ ఖల్ఖ్; ముస్లిం – కితాబుల్ ఈమాన్). అలాగే ప్రవక్త సహచరుడొకరు, తనతోపాటు ఒక చెట్టు కూడా దైవసన్నిధిలో సాష్టాంగపడుతున్నట్లు కలగన్నారు (తిర్మిజీ). అదేవిధంగా పర్వతాల, వృక్షాల నీడలను చూడండి–అవి కుడివైపు ఎడమ వైపు వాలటం కూడా వాటి సాష్టాంగ ప్రణామాన్ని సూచిస్తోంది. అర్రాద్ (15), అన్ నహ్ల్ (48, 49) సూరాలలోనూ వీటి ప్రస్తావన వచ్చింది.

20. ఇక్కడ 'సజ్దా' (సాష్టాంగ ప్రణామం) అన్న పదం వాస్తవ అర్థంలోనే ఉపయోగించబడింది. మానవుల్లో ఓ పెద్ద వర్గం దాస్యభావంతో దైవానికి సాష్టాంగ ప్రణామం చేస్తుంది. తద్వారా అది దైవప్రసన్నతకు నోచుకుంటుంది.

21. విధేయతాపూర్వకంగా సజ్దా చేయకుండా తిరస్కార వైఖరికి ఒడిగట్టేవారు వీరు. ఇకపోతే విశ్వప్రభువు సృష్టికై నిర్బంధం చేసిన ఆదేశాలకు లొంగిపోకుండా వైముఖ్యాన్ని ప్రదర్శించటం ఎవరి తరమూ కాదు సుమా!

هٰذٰنِ خَصْمٰنِ اخْتَصَمُوْا فِىْ رَبِّهِمْ ۫ فَالَّذِيْنَ كَفَرُوْا قُطِّعَتْ لَهُمْ ثِيَابٌ مِّنْ نَّارٍ ؕ يُصَبُّ مِنْ فَوْقِ رُءُوْسِهِمُ الْحَمِيْمُ ۚ ﴿١٩﴾

**19** ఆ ఇరువర్గాల వారు తమ ప్రభువు విషయంలో గొడవ పడతారు.[23] అయితే అవిశ్వాసుల కోసం అగ్ని వస్త్రాలు కత్తిరించబడతాయి. సలసల కాగే నీరు వారి తలలపై నుంచి కుమ్మరించ బడుతుంది.

يُصْهَرُ بِهٖ مَا فِىْ بُطُوْنِهِمْ وَالْجُلُوْدُ ؕ ﴿٢٠﴾

**20** దాని మూలంగా వారి చర్మాలే కాకుండా వారి కడుపుల్లో ఉన్నవి కూడా కరిగిపోతాయి.

وَلَهُمْ مَّقَامِعُ مِنْ حَدِيْدٍ ﴿٢١﴾

**21** ఇంకా, వారికొరకు (వారిని చితక బాదటానికి) ఇనుప సుత్తులు కూడా ఉన్నాయి.

كُلَّمَاۤ اَرَادُوْۤا اَنْ يَّخْرُجُوْا مِنْهَا مِنْ غَمٍّ اُعِيْدُوْا فِيْهَا ۗ وَذُوْقُوْا عَذَابَ الْحَرِيْقِ ۠ ﴿٢٢﴾

**22** ఆ బాధకు తట్టుకోలేక వారు అక్కణ్ణుంచి పారిపోవాలని అనుకున్నప్పుడల్లా తిరిగి అందులోనికే నెట్టివేయబడతారు. "దహన యాతన రుచి చూడండి"[24] (అని వారితో అనబడుతుంది).

22. దైవాదేశాలను ఎదిరించి, తిరస్కార వైఖరిని అవలంబించిన వారు పరాభవానికి, పరలోక యాతనకు గురికాక తప్పదు. ఈ అవమానం నుంచి అవిశ్వాసులను రక్షించి, మర్యాద చేసే వాడెవడూ ఉండడు.

23. ఇరువర్గాలలో ఒకటి మార్గభ్రష్టతకు గురైన వర్గం. ఇంకొకటి ముస్లిం వర్గం. వారుభయులూ తమ ప్రభువు వ్యవహారంలో తగవులాడుతున్నారు. దేవుడు ఒక్కడే అనీ, ఆయన చనిపోయినవారిని బతికించగల శక్తిశాలి అని ముస్లింలు చెబుతుండగా ఇతరులు పలు అపమార్గాలకు లోనై ఉన్నారు.

బద్ర్ యుద్ధంలో ముఖాముఖీ అయిన ముస్లింల – అవిశ్వాసుల నేపథ్యంలో కూడా ఈ విధంగా అనబడి ఉండవచ్చు. ఆ యుద్ధం ఆరంభంలో ముస్లింల తరఫున హజ్రత్ హమ్జా, హజ్రత్ అలీ, హజ్రత్ ఉబైదా (రజి)లు ఒకవైపు నిలబడగా – మరోవైపు అవిశ్వాసుల తరఫున ఉత్బా, షైబా, వలీద్ బిన్ ఉత్బాలు నిలిచారు (సహీహ్ బుఖారీ – తఫ్సీర్ సూరతుల్ హజ్).

ఈ రెండు భావాలు కూడా సరైనవేనని, ఆయతుకు అనుగుణంగా ఉన్నవేనని ఇమామ్ ఇబ్నె కసీర్ అభిప్రాయపడ్డారు.

24. నరకవాసులు నరకంలో అనుభవించే యాతనలలో కొన్ని మాత్రమే ఇక్కడ ప్రస్తావించ బడ్డాయి.

**23** విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికి క్రింద సెలయేరులు పారే (స్వర్గ) వనాలలో అల్లాహ్ ప్రవేశం కల్పిస్తాడు. అక్కడ వారు బంగారు కంకణాలు తొడిగించబడతారు – స్వచ్ఛమైన ముత్యాలు కూడా! వారు ధరించే వస్త్రాలు కూడా పట్టు వస్త్రాలై ఉంటాయి.[25]

إِنَّ اللَّهَ يُدْخِلُ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ جَنَّاتٍ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ يُحَلَّوْنَ فِيهَا مِنْ أَسَاوِرَ مِن ذَهَبٍ وَلُؤْلُؤًا ۖ وَلِبَاسُهُمْ فِيهَا حَرِيرٌ ﴿٢٣﴾

**24** పవిత్రమైన మాటలు పలికే బుద్ధి వారికి వొసగబడుతుంది.[26] స్తుతించ దగిన వాని మార్గం కూడా వారికి నిర్దేశిం చబడింది.[27]

وَهُدُوا إِلَى الطَّيِّبِ مِنَ الْقَوْلِ وَهُدُوا إِلَىٰ صِرَاطِ الْحَمِيدِ ﴿٢٤﴾

**25** నిశ్చయంగా ఎవరయితే అవిశ్వాసా నికి ఒడిగట్టి, అల్లాహ్ మార్గం నుండి, మస్జిదె హరామ్ నుండి (జనులను) అడ్డుకుంటున్నారో,[28] ఇంకా అక్కడ

إِنَّ الَّذِينَ كَفَرُوا وَيَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ وَالْمَسْجِدِ الْحَرَامِ الَّذِي جَعَلْنَاهُ لِلنَّاسِ سَوَاءً الْعَاكِفُ فِيهِ وَالْبَادِ

25. నరకవాసులకు ప్రతిగా స్వర్గవాసులకు లభించే అనుగ్రహాలు ఇవి. అయితే విశ్వసించిన వారికి మాత్రమే ఈ భాగ్యాలు ప్రాప్తిస్తాయని మరువరాదు.

26. స్వర్గం అతి పవిత్రమైన స్థలం. అక్కడ స్వర్గవాసులు మాట్లాడుకునే మాటలు కూడా పవిత్రమైనవే. వ్యర్థ ప్రేలాపనలకు, నీతిమాలిన పలుకులకు అక్కడ ఏమాత్రం ఆస్కారం ఉండదు.

27. వారు నివసించే స్థలంలో ఎటుచూసినా దైవస్తోత్రం జరుగుతూ ఉంటుంది. అందరి అధరాలు అల్లాహ్ పవిత్రతను ఆలాపిస్తూ ఉంటాయి. ఆయన ప్రసాదించిన స్వర్గ భాగ్యాలకుగాను స్వర్గవాసులు కృతజ్ఞతలు తెలుపుకుంటూ ఉంటారు. ఒకవేళ ఈ ఆయతు ప్రాపంచిక జీవితాన్ని ఉద్దేశించి చెప్పబడిందనుకుంటే అప్పుడు దీని భావం ఖుర్ఆన్ మరియు ఇస్లాం వైపు దర్శకత్వం వహించబడటం అవుతుంది. విశ్వాసులకు మాత్రమే ఆ భాగ్యం లభిస్తుంది.

28. పవిత్ర మస్జిదును సందర్శించకుండా అడ్డుకుంటున్నవారు మక్కా తిరస్కారులు. హిజ్రీ 6వ సంవత్సరంలో ముస్లింలు మక్కాలో ప్రవేశించి, కాబా గృహ దర్శనం చేసుకోకుండా వాళ్లు అవరోధం కల్పించారు. పర్యవసానంగా ముస్లింలు హుదైబియా నుంచే మదీనాకు వెనుదిరగవలసి వచ్చింది.

وَمَنْ يُّرِدْ فِيْهِ بِاِلْحَادٍۢ بِظُلْمٍ نُّذِقْهُ مِنْ عَذَابٍ اَلِيْمٍ ﴿٢٥﴾

అన్యాయంగా అడ్డదారులు తొక్కాలని ప్రయత్నిస్తున్నారో[29] వారికి మేము బాధాకరమైన శిక్ష రుచి చూపిస్తాం.[30] వాస్తవానికి మేము దానిని సర్వమానవుల కోసం సమానంగా చేసి ఉన్నాము. స్థానికులకు, బయటి నుంచి వచ్చేవారికి కూడా[31] (ఆ హక్కు సమానంగా వర్తిస్తుంది.)

29. అరబీలో 'ఇల్‌హాద్' (اِلْحَاد) అని ఉంది. ఇల్‌హాద్ అంటే అసలు వక్రవైఖరి అని అర్థం. అయితే దీని భావం చాలా విస్తృతమైనది. అవిశ్వాసం, తిరస్కారం, బహు దైవారాధన, నాస్తికత్వం, అవిధేయత, దుర్మార్గం, పాపకార్యాలు వంటివన్నీ ఇందులోకి వచ్చేస్తాయి. ఖుర్ఆన్ ప్రయోగించబడిన పదాలను దృష్టిలో పెట్టుకొని కొంతమంది పండితులు ఏమంటారంటే; హరామ్ ప్రాంతంలో ఎవరైనా చెడు పని గురించి సంకల్పించుకుంటే (వారు ఆ చెడుకు పాల్పడకపోయినప్పటికీ) వారికి కూడా పై ఆయతులోని హెచ్చరిక వర్తిస్తుంది. అయితే 'సంకల్పించుకున్నంత' మాత్రాన ఎవరూ శిక్షార్హులు కాజాలరని, సంకల్పానికి కార్యరూపం ఇవ్వాలని గట్టిగా నిశ్చయించుకుంటే మాత్రం శిక్షార్హులవుతారని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు (ఫత్‌హుల్ ఖదీర్).

30. పైన పేర్కొనబడిన దుర్మార్గాలకు ఒడిగట్టిన వారికి ఈ యాతన తప్పదు.

31. మస్జిదె హరామ్ అంటే ఒక్క కాబా గృహమేనా? లేక పూర్తి పవిత్ర (హరామ్) క్షేత్రమా? అన్న విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఎందుకంటే ఖుర్ఆన్‌లో కొన్నిచోట్ల మొత్తం హరమ్ ప్రాంతం కోసం కూడా 'మస్జిదె హరామ్' అన్న పదం వాడబడింది. ప్రత్యేక కాబా గృహం విషయానికి వస్తే దానిపై సమస్త ముస్లింలకు – వారు స్థానికులైనా, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారైనా – సమానంగా హక్కు ఉంది. ఈ విషయంలో ద్వంద్వాభిప్రాయానికి తావులేదు. అంటే జాతి, వర్ణ, ప్రాంతీయ భేదం లేకుండా విశ్వసించిన వారందరూ రేయింబవళ్లలో ఎప్పుడైనా వెళ్ళి కాబాగృహ ప్రదక్షిణ చేయవచ్చు. ఆ పుణ్యక్షేత్రంలో ఒక ముస్లింను దైవారాధన చేయకుండా అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు.

అయితే ఇక్కడ మస్జిదె హరామ్ అంటే యావత్తు హరమ్ పరిధి అని భావించే ఉలమాలలో కొందరేమంటారంటే 'మక్కా హరమ్ ప్రాంతమంతా సమస్త ముస్లింలకు సమానంగా వర్తిస్తుంది. అక్కడి నివాస గృహాలకు, భూములకు ఎవరూ యజమానులు కాలేరు.' అందుకే అక్కడి ఇండ్లను, హోటళ్లను అమ్మటం, కొనటం, అద్దెకు ఇవ్వటం వారి దృష్టిలో ధర్మసమ్మతం కాదు. హజ్ మరియు ఉమ్రాల కోసం మక్కా నగరానికి

وَإِذْ بَوَّأْنَا لِإِبْرٰهِيمَ مَكَانَ الْبَيْتِ أَنْ لَّا تُشْرِكْ بِي شَيْئًا
وَّطَهِّرْ بَيْتِيَ لِلطَّآئِفِينَ وَالْقَآئِمِينَ وَالرُّكَّعِ السُّجُودِ ٢٦

**26** మేము ఇబ్రాహీమునకు కాబా గృహ స్థలాన్ని నిర్ధారించినపుడు[32] పెట్టిన షరతు ఇది : నాకు భాగస్వామ్యంగా దేనినీ కల్పించకూడదు.[33] నా గృహాన్ని ప్రదక్షిణ చేసేవారి కోసం, నిలబడేవారి కోసం, తల వంచేవారి కోసం, సాష్టాంగపడే వారి కోసం పవిత్రంగా ఉంచాలి.[34]

విచ్చేసే ప్రతి యాత్రీకుడు తనకిష్టం వచ్చినచోట బస చేయవచ్చు. స్థానికులు ఎవరూ ఈ అతిథులకు అడ్డు తగల కూడదు.

రెండవ అభిప్రాయం: దీని ప్రకారం స్థానికులు అక్కడి ఇళ్లపై, భూములపై యాజమాన్యం కలిగి ఉండటంలో తప్పులేదు. వాటి క్రయవిక్రయాలు కూడా ధర్మసమ్మతమే. అయితే హజ్ క్రియల పరిధిలోకి వచ్చే నిర్ణీత స్థలాలు మాత్రం–ఉదాహరణకు: మినా, ముజ్దలిఫా, అరఫాత్ వంటి స్థలాలు మాత్రం హజ్ యాత్రీకుల కోసం ఉద్దేశించినవి. అవి వక్ఫ్ విభాగం క్రిందికి వస్తాయి. ఆ స్థలాలు ఏ ఒక్కరికీ చెందిన ఆస్తి కానేరవు.

ఈ వ్యవహారంపై సనాతన ఫుకహాల (ధర్మవేత్తల) మధ్య అభిప్రాయభేదం ఉండేది. అయితే ఇప్పుడది దాదాపు సమసిపోయినట్లే. దాదాపు పండితులంతా వ్యక్తిగత ఆస్తిని అంగీకరిస్తున్నారు. మౌలానా ముఫ్తీ షఫీ (రహ్మ.లై) గారు కూడా ఇమామ్ అబూ హనీఫా సహా అనేకమంది ఫుకహాల అభిమతాన్ని ఉటంకిస్తూ స్థానికులు అక్కడి ఆస్తిపాస్తులకు యజమానులై ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. (వివరాలకు చూడండి : మారిఫుల్ ఖుర్ఆన్, సంపుటి – 6, పేజీ – 253).

32. అంటే కాబా గృహం కట్టవలసిన స్థలం ఇబ్రాహీంకు చూపబడింది. అక్కడ మేము ఇబ్రాహీం (అలైహిస్సలాం) సంతతిని వసింపజేశాము. దీన్నిబట్టి అర్థమయ్యేదేమిటంటే దైవప్రవక్త హజ్రత్ నూహ్ (అలైహిస్సలాం) కాలంలో వచ్చిన జలప్రళయం తరువాత – కాబా గృహ నిర్మాణం ప్రప్రథమంగా ఇబ్రాహీం చేతుల మీదుగా జరిగింది. సహీహ్ హదీసు ద్వారా కూడా ఈ విషయం రూఢీ అవుతోంది – "మొట్టమొదటి సారిగా భూ మండలంపై నిర్మించబడిన మస్జిద్ 'మస్జిదె హరాం' (మక్కాలోని పవిత్ర కాబా మస్జిదు). ఈ గృహం నిర్మించబడిన 40 సంవత్సరాల తరువాత 'మస్జిదె అక్సా' నిర్మించబడింది." (ముస్నదె అహ్మద్ – 5/150 (166, 167 పేజీలు); ముస్లిం – కితాబుల్ మసాజిద్).

33. కాబా గృహ నిర్మాణం అసలు ఉద్దేశం ఏమిటో ఇక్కడ చెప్పబడింది. అక్కడ కేవలం తన ఆరాధన మాత్రమే జరగాలని అల్లాహ్ స్పష్టంగా నిర్దేశించాడు. ఈ వాక్యం ద్వారా చెప్పదలచిందేమిటంటే ముష్రిక్కులు అక్కడ విగ్రహాలను ప్రతిష్ఠించి ఘోరమైన

**27** హజ్ (యాత్ర)కై ప్రజలలో ప్రకటన గావించు.[35] ప్రజలు నీ వద్దకు అన్ని సుదూర మార్గాల నుంచి కాలినడకన కూడా వస్తారు, బక్కచిక్కిన ఒంటెలపై[36] కూడా స్వారీ అయి వస్తారు.

وَأَذِّن فِي النَّاسِ بِالْحَجِّ يَأْتُوكَ رِجَالًا وَعَلَىٰ كُلِّ ضَامِرٍ
يَأْتِينَ مِن كُلِّ فَجٍّ عَمِيقٍ ﴿٢٧﴾

**28** వారు తమ ప్రయోజనాలు పొందటానికి రావాలి.[37] అల్లాహ్ తమకు ప్రసాదించిన తమ పెంపుడు పశువుల మీద[38]

لِّيَشْهَدُوا مَنَافِعَ لَهُمْ وَيَذْكُرُوا اسْمَ اللَّهِ فِي أَيَّامٍ
مَّعْلُومَاتٍ عَلَىٰ مَا رَزَقَهُم مِّن بَهِيمَةِ الْأَنْعَامِ

అపచారానికి పాల్పడ్డారు. కాబా గృహానికి ఉన్న పవిత్రతను, విశిష్ఠతను మంటగలిపారు. ఇది చాలా దారుణమైన విషయం. కాబట్టి కాబా గృహంలోని ఈ షిర్క్ కాలుష్యాన్ని తొలగించి, దాని పవిత్రతను కాపాడవలసి ఉంది. అక్కడ కేవలం ఒక్కడైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి.

34. అంటే కుఫ్ర్ (అవిశ్వాసం), విగ్రహారాధన తదితర కాలుష్యాల నుంచి, అపసవ్యమైన పోకడల నుంచి ఆ స్థలాన్ని పవిత్రంగా ఉంచాలి. ఎందుకంటే అది ఏకదైవారాధన కోసం ఆమోదించబడిన గృహం. ఇక్కడ కేవలం నమాజు చేసేవారిని, ప్రదక్షిణ చేసేవారిని మాత్రమే ప్రస్తావించటం జరిగింది. ఇవి రెండూ (నమాజు, కాబా ప్రదక్షిణ) కాబా గృహంతో ముడిపడి ఉన్న ప్రధానాంశాలు. నమాజు చేసే ప్రతి వ్యక్తీ కాబా వైపుకు తిరిగి చేస్తాడు. ప్రదక్షిణ కూడా కేవలం కాబాకు మాత్రమే పరిమితం, ప్రత్యేకం. ఇతర ప్రార్థనాలయాల వద్ద ప్రదక్షిణ చేయడానికి వీల్లేదు. కాని శోచనీయమైన విషయం ఏమిటంటే ముస్లిం సమాజంలో కొత్తపుంతలపై మోజుపడే మహానుభావులు (బిద్అతీలు) ఈనాడు సమాధులను, దర్గాలను కూడా ప్రదక్షిణా స్థలాలుగా మార్చుకున్నారు. ఈ అపమార్గం క్షంతవ్యం కానిది.

35. మక్కా పర్వత శిఖరాల నుంచి పుట్టిన ఈ ప్రకటన ప్రపంచం నలుమూలలా ప్రతిధ్వనించింది. నేల నాలుగు దిక్కుల నుంచి ఏకదైవారాధకులు హజ్ ఉమ్రాల కోసం ఈ కేంద్ర కాబా గృహం వైపుకు తరలివస్తున్నారు.

36. ఈ ఒంటెలు సుదీర్ఘ ప్రయాణాలవల్ల గానీ, తగినంత గ్రాసం లేకపోవటంవల్ల గానీ, అలసట వల్లగానీ బక్కచిక్కిపోతాయి.

37. ఈ ప్రయోజనాలు ప్రాపంచికమైనవీ, ధార్మికమైనవి కూడాను. నమాజ్, ప్రదక్షిణ (తవాఫ్), హజ్ క్రియలు – అంటే సయీ, అరఫాత్‌లో విడిది, జమరాత్, ఖుర్బానీ తదితర అంశాల ద్వారా హాజీలకు అపారమైన ధార్మిక శుభాలు కలుగుతాయి. దేవుని క్షమాభిక్ష ప్రాప్తమవుతుంది. మరోవైపు వ్యాపారం, క్రయవిక్రయాల ద్వారా ప్రాపంచిక లాభాలు కూడా ఒనగూరుతాయి.

فَكُلُوا مِنْهَا وَأَطْعِمُوا الْبَائِسَ الْفَقِيرَ ﴿٢٨﴾

ఆ నిర్ణీత దినాలలో అల్లాహ్ నామాన్ని స్మరించాలి (ఉచ్చరించాలి). ఆ తరువాత వాటిని మీరూ తినండి, దుర్భర స్థితిలో ఉన్న అగత్యపరులకు కూడా తిని పించండి.

ثُمَّ لْيَقْضُوا تَفَثَهُمْ وَلْيُوفُوا نُذُورَهُمْ وَلْيَطَّوَّفُوا بِالْبَيْتِ الْعَتِيقِ ﴿٢٩﴾

**29** ఆ తరువాత వారు తమ మురికిని దూరం చేసుకోవాలి,[39] తమ మొక్కు బడులను చెల్లించాలి.[40] (అనంతరం దేవుని) ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణ చేయాలి.[41]

38. పెంపుడు పశువులు (బహీమతుల్ అన్ఆమ్) అంటే ఒంటెలు, ఆవులు, మేకలు, గొర్రెలు అని భావం. వాటిపై అల్లాహ్ పేరును స్మరించటమంటే 'ఖుర్బానీ' చేయటమన్నమాట! నిర్ణీత దినాలంటే 'అయ్యామె తష్రీఖ్.' ఇవి జిల్‌హజ్ 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉంటాయి. ఈ రోజులలో ఎప్పుడైనా ఖుర్బానీ ఇవ్వవచ్చు. సాధారణంగా 'అయ్యామె మాలూమాత్' (నిర్ణీత దినాలు) అంటే జిల్‌హిజ్జా మాసపు మొదటి పదిరోజులనీ, 'అయ్యామె మాదూదాత్' (కొన్ని దినాలు) అంటే 'అయ్యామె తష్రీఖ్' అని భావం తీసుకుంటారు. అయితే సందర్భాన్నిబట్టి ఇక్కడ 'మాలూమాత్' (నిర్ణీతమైన) అన్న పదం 'తష్రీఖ్' దినాల కోసమే ఉపయోగించబడి ఉంటుందని అర్థమవుతోంది. వాస్తవం అల్లాహ్‌కే బాగా తెలుసు.

39. జిల్ హజ్ 10వ తేదీన పెద్ద జమ్రా (లేక అఖబా స్తంభం)పై కంకర రాళ్లు రువ్విన తరువాత హాజీపైనుంచి తొలి దశ ఇహ్రాం ఆంక్షలు సడలించబడతాయి. ఇప్పుడు అతను ఇహ్రాం దుస్తులను విడుస్తాడు. భార్యతో సంభోగించటం తప్ప – ఇహ్రాం స్థితిలో నిషేధించబడిన పనులన్నీ అతని కోసం ధర్మసమ్మతం అయిపోతాయి. 'మురికి'ని దూరం చేసుకోవటమంటే క్షవరం చేసుకోవటం, గోళ్లు కత్తిరించటం, తైలసంస్కారం చేసుకోవటం, సుగంధద్రవ్యాలు పూసుకోవటం, కుట్టిన దుస్తులు ధరించటం మొదలగునవి.

40. ఒకవేళ ఏదన్నా మొక్కుకుని ఉంటేనే ఈ ఆదేశం వర్తిస్తుంది. ఉదాహరణకు : పవిత్ర కాబా గృహాన్ని దర్శించే భాగ్యం దేవుడు ప్రసాదిస్తే ఫలానా సత్కార్యం చేస్తానని సంకల్పించుకుని ఉంటే దాన్ని నెరవేర్చాలి.

41. **'ప్రాచీన గృహం'** (బైతున్ అతీఖ్) అంటే పవిత్ర కాబా గృహం. శిరోముండనం లేక క్షవరం తరువాత కాబా గృహప్రదక్షిణ చేయాలి. దీన్నే 'తవాఫె ఇఫాజా' లేక 'తవాఫె జియారత్' అని కూడా అంటారు. ఇది కూడా హజ్ క్రియలలో ఒక అతి

ذٰلِكَ وَمَنْ يُّعَظِّمْ حُرُمٰتِ اللّٰهِ فَهُوَ خَيْرٌ لَّهٗ عِنْدَ رَبِّهٖ ؕ وَاُحِلَّتْ لَـكُمُ الْاَنْعَامُ اِلَّا مَا يُتْلٰى عَلَيْكُمْ فَاجْتَنِبُوا الرِّجْسَ مِنَ الْاَوْثَانِ وَاجْتَنِبُوْا قَوْلَ الزُّوْرِ ۙ﴿۳۰﴾

**30** ఇది (హజ్ కొరకు నిర్దేశించబడిన పద్ధతి). ఎవడయితే అల్లాహ్ విధించిన కట్టుబాట్లను[42] గౌరవిస్తాడో అతనికోసం అతని ప్రభువు వద్ద మేలుంది. మీకు తెలియజేయబడిన(హరాం) జంతువులు[43] తప్ప మిగిలిన పశువులు మీకోసం ధర్మ సమ్మతం (హలాల్) చేయబడ్డాయి. కాబట్టి మీరు విగ్రహాల మాలిన్యానికి దూరంగా ఉండాలి,[44] సత్యవిరుద్ధమైన మాటలకు కూడా దూరంగా ఉండాలి.[45]

ముఖ్య అంశం. అరఫాత్‌లో విడిది చేసిన తరువాత, 'రమీ' చేసిన తరువాత ఈ ప్రదక్షిణ చేయబడుతుంది. కాగా; 'తవాఫె ఖుదూమ్'ను కొందరు తప్పనిసరి (వాజిబ్)గానూ, కొందరు సంప్రదాయం (సున్నత్)గానూ భావిస్తున్నారు. తవాఫె విదాను మాత్రం 'సున్నతె ముఅక్కద' (లేక వాజిబ్)గా పరిగణిస్తున్నారు. అయితే అత్యధికమంది పండితుల అభిప్రాయం ప్రకారం షరీయతుపరమైన తగు కారణం ఏదన్నా ఉంటే ఈ క్రియను నెరవేర్చకపోయినా ఫరవాలేదు. ఉదాహరణకు : బహిష్టు అయిన స్త్రీ ఈ ప్రదక్షిణ చేయనవసరం లేదు (ఐసరుత్తఫాసీర్).

42. 'అల్లాహ్ విధించిన కట్టుబాట్లు' అంటే ఇంతకుముందు పేర్కొనబడిన హజ్ క్రియలు అని భావం. 'గౌరవించటం' అంటే సూచించబడిన రీతిలోనే హజ్‌ను నెరవేర్చటం అని అర్థం. వాటికి విరుద్ధంగా ప్రవర్తించి దైవనియమాలను కాలరాయకూడదు.

43. అంటే ఏ ఏ జంతువులు మీ కోసం నిషేధించబడ్డాయో ఇంతకు ముందే సవివరంగా చెప్పటం జరిగింది. ఉదాహరణకు : **హుర్రిమత్ అలైకుముల్ మైతతు, వద్దము**.... అనే ఆయతులో ఈ వివరాలు వచ్చాయి. (అల్ బఖర – 173, మాయిద – 3)

44. **'రిజ్స్'** ( رِجْس ) అంటే మాలిన్యం, అశుద్ధత అని అసలు అర్థం. కాని ఈ ఆయతులో 'రిజ్స్' అంటే కొయ్యతోనూ, లోహంతోనూ, మరేదైనా వస్తువుతోనూ చేయబడిన విగ్రహాలని భావం. అల్లాహ్‌ను వదలి ఇతరత్రా వాటిని పూజించటం అశుద్ధతను, అపసవ్యతను అవలంబించటమే. ఇది ఒకవిధంగా దైవాగ్రహాన్ని కొనితెచ్చుకోవటం వంటిదే. కాబట్టి ఈ బహుదైవారాధనకు దూరంగా ఉండండి.

45. అసత్యమైన పలుకులో అబద్ధ ప్రమాణం కూడా ఉంది. (హదీసు ప్రకారం ఇది షిర్క్, తల్లిదండ్రుల అవిధేయత తరువాత మూడో పెద్ద పాపకార్యం). అల్లాహ్ ఏ ఏ విషయాలకు అతీతుడో వాటిని అల్లాహ్‌కు అంటగట్టడం అన్నిటికన్నా పెద్ద అసత్యం. ఉదాహరణకు : అల్లాహ్‌కు సంతానం ఉందని అనటం, ఫలానా పుణ్యపురుషుడు

**31** ఏకాగ్రతతో దేవుని ఏకత్వాన్ని అనుసరిస్తూ,[46] ఆయనకు సాటి కల్పించకుండా ఉండాలి. వినండి! అల్లాహ్‌కు సాటి కల్పించేవాడు ఆకాశం నుంచి క్రిందపడి పోయిన వానితో సమానం. ఇప్పుడతన్ని పక్షులైనా తన్నుకుపోతాయి లేదా పెనుగాలి అయినా ఎత్తి దూరప్రదేశంలో విసిరేస్తుంది.[47]

حُنَفَآءَ لِلّٰهِ غَيۡرَ مُشۡرِكِيۡنَ بِهٖ ؕ وَمَنۡ يُّشۡرِكۡ بِاللّٰهِ فَكَاَنَّمَا
خَرَّ مِنَ السَّمَآءِ فَتَخۡطَفُهُ الطَّيۡرُ اَوۡ تَهۡوِىۡ بِهِ الرِّيۡحُ فِىۡ
مَكَانٍ سَحِيۡقٍ ﴿۳۱﴾

**32** ఇది (తెలుసుకున్నారు కదా! ఇది కూడా తెలుసుకోండి!). అల్లాహ్ చిహ్నాలను ఎవరయినా గౌరవిస్తున్నారంటే అది వారి హృదయాలలోని భక్తిభావన వల్లనే సుమా![48]

ذٰ لِكَ وَمَنۡ يُّعَظِّمۡ شَعَآٮِٕرَ اللّٰهِ فَاِنَّهَا مِنۡ تَقۡوَى الۡقُلُوۡبِ ﴿۳۲﴾

అల్లాహ్ అధికారాలలో భాగస్థుడు అని బుకాయించటం, ఫలానా పనిని అల్లాహ్ ఎలా చేయగలడు?! అని సందేహాన్ని వ్యక్తపరచటం – ఇవన్నీ అసత్య ప్రేలాపనలుగానే పరిగణించబడతాయి. మరణానంతర జీవితం అసలెలా సాధ్యం అని అవిశ్వాసులు అనేవారు. ఇప్పటికీ అంటున్నారు. అల్లాహ్ ధర్మసమ్మతం గావించిన వస్తువులను అధర్మంగా చేసుకోవటం, అధర్మమైన వస్తువులను ధర్మసమ్మతమని తమంతట తాముగా ఖరారు చేసుకోవటం కూడా అసత్యం క్రిందికే వస్తుంది. అలాంటి వాటికి ఆమడదూరాన ఉండాలి.

46. మనిషి దేవుని ఏకత్వం విషయంలో స్థిరంగా ఉండాలి. ఒకేమాటపై ఉండాలి, ఒకే బాటపై నడవాలి. ఒకే దిక్కుకు తిరిగి దైవారాధన చేయాలి. మనసును ఒక్కడైన అల్లాహ్‌పైనే లగ్నం చేయాలి. అంటే షిర్క్ నుంచి తౌహీద్ వైపుకు మరలాలి. అసత్యం నుంచి సత్యధర్మమైన ఇస్లాం వైపుకు ప్రస్థానం చేయాలి. మూలంలో **'హునఫా'** (حنفاء) అని వచ్చింది. ఇది 'హనీఫ్'కు బహువచనం. ఒక వైపుకు తిరగటం, ఏకోన్ముఖులవటం, ఒకే వైపుకు మళ్ళటం అని దాని భావం.

47. ఏ విధంగానయితే గ్రద్దలు, డేగలు పైనుంచి వచ్చి చిన్న చిన్న జంతువులను తన్నుకు పోతాయో లేదా పొడిచి తింటాయో లేక ఉధృతమైన గాలులు నేలపైని వస్తువులను ఎగరేసుకు పోతాయో, నిజదైవాన్ని వదలి షిర్క్‌కు ఒడిగట్టిన వాని పరిస్థితి కూడా అదే అవుతుంది.

దేవుని ఏకత్వంపై దృఢ విశ్వాసం కలిగి ఉండి, ఆయన్ని ఆరాధించే వ్యక్తి శాంతి,

| | |
|---|---|
| **33** ఒక నిర్ధారిత గడువు వరకు వాటిలో (ఖుర్బానీ పశువులలో) మీ కోసం కొన్ని లాభాలు ఉన్నాయి.[49] ఆ తరువాత అవి జిబహ్ చేయబడే చోటు ప్రాచీన గృహం (వద్దనే ఉంది).[50] | لَكُمْ فِيهَا مَنَافِعُ إِلَىٰٓ أَجَلٍ مُّسَمًّى ثُمَّ مَحِلُّهَآ إِلَى ٱلْبَيْتِ ٱلْعَتِيقِ ﴿٣٣﴾ |

సుస్థిరత, ఆత్మతృప్తి, ఆత్మశుద్ధి రీత్యా అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తాడు. దీనికి భిన్నంగా షిర్క్‌కు ఒడిగట్టినవాడు (బహుదైవోపాసనకు లోనైనవాడు) ఉన్నత శిఖరాల నుంచి పాతాళానికి పడిపోతాడు.

48. **'షఆయిర్'** (شَعَائِر) అంటే గుర్తులు, చిహ్నాలు అని అర్థం. 'సంకేతం' అని కూడా ఒక అర్థం వస్తుంది. యుద్ధాల, సైనిక చర్యల కోసం కూడా కొన్ని సంకేత పదాలను ఉపయోగిస్తారు. ఆ 'కోడ్'ను సంబంధిత వ్యక్తులు మాత్రమే గ్రహించగలుగుతారు. అలాగే 'దేవుని చిహ్నాలు' అంటే ఇస్లాం ధర్మవైశిష్ట్యాన్ని, ప్రత్యేకతను చాటిచెప్పే ఆదేశాలు అన్నమాట. వాటిద్వారా ఒక ముస్లిం ప్రపంచంలో తన వ్యక్తిత్వాన్ని, వైశిష్ట్యాన్ని చాటిచెబుతాడు. ఇతర మతాల నుండి ఆ 'చిహ్నాలు' అతన్ని స్పష్టంగా వేరుపరుస్తాయి. మక్కాలోని సఫా – మర్వా పర్వతాలు కూడా దేవుని చిహ్నాలుగా ఖరారు చేయబడ్డాయి. ఎందుకంటే ముస్లింలు హజ్, ఉమ్రాల సందర్భంగా ఈ రెండు కొండల మధ్య 'సయీ' చేస్తారు. ఈ ఆయతులో హజ్‌లోని ఇతర క్రియలు కూడా దైవచిహ్నాలుగా, ముఖ్యంగా ఖుర్బానీ పశువులు 'దైవచిహ్నాలు'గా అభివర్ణించ బడ్డాయి. వాటిని గౌరవించటమంటే అర్థం ఏమిటీ? బలిష్టమైన, ఏ లోపమూ లేని పశువులను ఖుర్బానీ ఇవ్వటం. ఈ త్యాగం (ఖుర్బానీ) భయభక్తులకు ఆనవాలుగా చెప్పబడింది. భయము, భక్తి (తఖ్వా) అన్నది ఆంతర్యంతో ముడిపడిన విషయం. అది పైకి కనిపించదు. ఆంతర్యం ఎంత నిర్మలంగా, ప్రకాశవంతంగా ఉంటుందో ఆరాధన కూడా అంతే స్వచ్ఛంగా, గొప్పగా ఉంటుంది.

49. **'లాభాలు'** అంటే ఖుర్బానీ కోసం సమకూర్చుకున్న పశువుల ద్వారా కలిగే లాభాలు అన్నమాట. అవి వాహనాలుగా ఉపయోగపడతాయి. వాటిద్వారా పాలు లభ్యమవుతుంది. వాటి ఉన్ని లాభాలను ఆర్జించిపెడుతుంది. ఆ పశువులు 'జిబహ్' అయ్యేవరకూ వాటి ద్వారా లబ్ధిపొందటంలో తప్పులేదు. ప్రామాణిక హదీసుల ద్వారా కూడా ఈ సంగతి రూఢీ అవుతోంది. ఒకసారి ఒక వ్యక్తి ఖుర్బానీ పశువు (మీద కూర్చోకుండా)ను తోలుకుపోతుండగా, దానిపై కూర్చోమని మహాప్రవక్త (సఅసం) అతనికి సూచించారు. అది హజ్ సందర్భంగా ఖుర్బానీ ఇవ్వవలసిన పశువు అని ఆ వ్యక్తి చెప్పాడు. "ఫరవాలేదు. దానిపై కూర్చో" అని మహనీయ ముహమ్మద్ (సఅసం) ఉద్బోధించారు (సహీహ్ బుఖారీ – కితాబుల్ హజ్).

50. **"మహిల్లు"** (مَحِلّ) అంటే ఖుర్బానీ (జిబహ్) కావలసిన ప్రదేశం అని భావం. హజ్ యాత్రీకుడు హజ్ క్రియలను నెరవేర్చిన పిదప ఈ ఖుర్బానీ పశువులు పుణ్యక్షేత్రం

**34** తమకు అల్లాహ్ ప్రసాదించివున్న పశువులపై అల్లాహ్ పేరును స్మరించటానికిగాను మేము ప్రతి అనుచర సమాజం కోసం ఖుర్బానీ ఆచారాన్ని నిర్థారించాము.[51] కనుక మీ ఆరాధ్య దేవుడు ఒకే ఆరాధ్యదేవుడని తెలుసుకోండి. కాబట్టి మీరు ఆయన ఆజ్ఞలనే శిరసావహించండి. (కనుక ఓ ముహమ్మద్) వినమ్రులైన వారికి శుభవార్తను వినిపించు.

وَلِكُلِّ أُمَّةٍ جَعَلْنَا مَنسَكًا لِّيَذْكُرُوا اسْمَ اللَّهِ عَلَىٰ مَا
رَزَقَهُم مِّن بَهِيمَةِ الْأَنْعَامِ ۗ فَإِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ
فَلَهُ أَسْلِمُوا ۗ وَبَشِّرِ الْمُخْبِتِينَ ﴿٣٤﴾

**35** (వారిలోని సుగుణం ఏమిటంటే) అల్లాహ్ నామం స్మరించినప్పుడు వారి హృదయాలు వణుకుతాయి. తమపై ఏ ఆపద వచ్చిపడినా వారు ఓర్పు వహిస్తారు, నమాజులను నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చు చేస్తూ ఉంటారు.

الَّذِينَ إِذَا ذُكِرَ اللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَالصَّابِرِينَ عَلَىٰ
مَا أَصَابَهُمْ وَالْمُقِيمِي الصَّلَاةِ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ ﴿٣٥﴾

---

పరిధిలోని ఖుర్బానీ ఇచ్చే స్థలంలోకి చేర్చబడతాయి. పుణ్యక్షేత్రం పరిధిలోనికి వచ్చినప్పటి నుంచి ఆ 'హదీ' పశువుల ద్వారా ఎలాంటి 'లబ్ధీ' పొందకూడదు.

51. అరబీ మూలంలో **'మన్‌సకన్'** ( مَنسَكًا ) అని వుంది. దైవసామీప్యం కోసం పశువును బలి ఇవ్వటాన్ని మన్‌సకున్‌గా వ్యవహరిస్తారు. అయితే దైవవిధేయత, ఉపాసనా రీతుల కోసం కూడా ఈ పదం వాడబడుతుంది. దైవప్రసన్నతను బడయటానికి పశువును ఖుర్బానీ ఇవ్వటం కూడా ఆరాధనలో అంతర్భాగం అవటం వల్ల దైవేతరుల మెప్పుకోసం దైవేతరుల పేర పశువును జిబహ్ చేస్తే అది దైవేతరుల పూజగా పరిగణించబడుతుంది. హజ్ విధి నిర్వహణలో ప్రధానాంశాలైన అరఫాత్ మైదానంలో విడిది, ముజ్దలిఫాలో ప్రార్థన, కాబా ప్రదక్షిణ, సయీ, మినాలోని క్రియలు కూడా ఈ **'మనాసిక్'** పరిధిలోకి వస్తాయి. మొత్తమ్మీద ఈ ఆయతు సారాంశం ఏమిటంటే; మేము లోగడ కూడా వివిధ సమాజాల వారికి పశువులను జిబహ్ చేసే పద్ధతిని, హజ్ యాత్రను నిర్వహించే రీతినీ చూపుతూ వచ్చాము. ఈ ఉపాసనల ద్వారా అల్లాహ్ సామీప్యం పొందటం దీని అసలు ఉద్దేశం. అందుకే పశువులను జిబహ్ చేసేటప్పుడు మా పేరును ఉచ్చరించాలి. అంటే 'బిస్మిల్లాహి వల్లాహు అక్బర్' అని పలికి పశువులను కోయాలి అని దేవుడు ఉపదేశిస్తున్నాడు.

**36** ఖుర్బానీ ఒంటెలను[52] (కూడా) మేము మీకోసం అల్లాహ్ చిహ్నాలుగా నిర్ధారించాము. వాటిలో మీకు మేలున్నది. కాబట్టి వాటిని వరుసగా నిలబెట్టి, వాటిపై అల్లాహ్ పేరును ఉచ్చరించండి.[53] మరి వాటి ప్రక్కలు నేలకొరిగిన తరువాత,[54] వాటిని (మీరూ) తినండి,[55] అడగని అభాగ్యులకు, అడిగే అగత్యపరులకు కూడా తినిపించండి.[56] ఈ విధంగా మీరు కృతజ్ఞతాపూర్వకంగా మసలుకునేందుకుగాను మేము ఈ పశువులను మీకు స్వాధీనపరిచాము.

وَالْبُدْنَ جَعَلْنٰهَا لَكُمْ مِّنْ شَعَآئِرِ اللّٰهِ لَكُمْ فِيْهَا خَيْرٌ ۖ فَاذْكُرُوا اسْمَ اللّٰهِ عَلَيْهَا صَوَآفَّ ۚ فَاِذَا وَجَبَتْ جُنُوْبُهَا فَكُلُوْا مِنْهَا وَاَطْعِمُوا الْقَانِعَ وَالْمُعْتَرَّ ؕ كَذٰلِكَ سَخَّرْنٰهَا لَكُمْ لَعَلَّكُمْ تَشْكُرُوْنَ ﴿٣٦﴾

52. **'బుద్న్'** (بُدْن) అంటే అసలు బలిసిన జంతువులు అని అర్థం. అయితే అరబ్బు నిఘంటుకర్తలు ఈ పదాన్ని ఒంటెల కోసం ప్రత్యేకించారు. హదీసు ప్రకారం చూస్తే ఈ పదం ఆవులకు కూడా వర్తిస్తుంది. చెప్పవచ్చిందేమిటంటే ఖుర్బానీ కోసం కాబా గృహానికి తరలించబడే పశువులు – ఒంటెలైనా, ఆవులైనా – కూడా దేవుని చిహ్నాలలోనివే.

53. ఆ పశువులు (ఒంటెలు) వరుసగా నిలబెట్టబడి ఉండాలి. నిలబడిన స్థితిలోనే వాటి గొంతుపై బల్లెంతో పొడవాలి. దీన్నే 'నహర్' గా వ్యవహరిస్తారు. ఎడమ (ముందు) పాదం కట్టబడి ఉంటుంది. మూడు కాళ్లపై మాత్రమే అది నిలబడి ఉంటుంది.

54. శరీరంలోని రక్తమంతా ప్రవహించి, ప్రాణం విడిచి క్రిందపడిపోయిన తరువాత మాంసం కోయాలి. ఎందుకంటే బ్రతికివున్న జంతువు మాంసం తినటం నిషిద్ధం. ఏ జంతువును అయినా సజీవంగా ఉన్న స్థితిలో దాని మాంసాన్ని కోస్తే, అలా కోసిన మాంసం మృత మాంసం అవుతుంది. (అబూదావూద్ – కితాబుస్సైద్; తిర్మిజీ – అబ్వాబుస్సైద్; ఇబ్నుమాజ).

55. కొంతమంది పండితులు ఈ ఆదేశాన్ని ఆధారంగా తీసుకుని ఖుర్బానీ ఇచ్చిన వ్యక్తి, ఆ ఖుర్బానీ మాంసాన్ని స్వయంగా భుజించటాన్ని తప్పనిసరి (వాజిబ్) గా ఖరారు చేశారు. అయితే అత్యధికమంది పండితులు మాత్రం దీనిని అభిలషణీయంగా పరిగణించారు (తప్పనిసరి అని చెప్పలేదు). అంటే, కొంత తింటే మంచిదే. కాని ఏ కారణంగానయినా తినలేక మొత్తం పంచిపెట్టేస్తే వచ్చిన చిక్కేమీ లేదు.

56. పేదలలో కొందరు అడిగేవారు (యాచకులు) ఉంటారు, మరి కొందరు ఆత్మాభిమానం వల్ల కోర్కెలను లోలోపలే అణచిపెట్టుకుంటారు. ఇవ్వమని అడగరు. ఈ ఆయతు

| | |
|---|---|
| **37** వాటి మాంసంగానీ, రక్తంగానీ అల్లాహ్‌కు చేరవు. అయితే మీలోని భక్తి పరాయణత (తఖ్వా) మాత్రం ఆయనకు చేరుతుంది. ఈ విధంగా అల్లాహ్ ఈ పశువులను మీకు లోబరిచాడు – ఆయన మార్గ దర్శకత్వానికి కృతజ్ఞతగా మీరు ఆయన గొప్పదనాన్ని కొనియాడటానికి! (ఓ ముహమ్మద్!) సదాచార సంపన్నులకు సంతోషవార్త వినిపించు. | لَنْ يَّنَالَ اللّٰهَ لُحُوْمُهَا وَلَا دِمَآؤُهَا وَلٰكِنْ يَّنَالُهُ التَّقْوٰى مِنْكُمْ ۚ كَذٰلِكَ سَخَّرَهَا لَكُمْ لِتُكَبِّرُوا اللّٰهَ عَلٰى مَا هَدٰىكُمْ ۗ وَبَشِّرِ الْمُحْسِنِيْنَ ﴿٣٧﴾ |

ఆధారంగా కొంతమంది పండితులు ఖుర్బానీ మాంసాన్ని మూడు భాగాలుగా విభజించాలని చెబుతారు – ఒక భాగం: ఖుర్బానీ ఇచ్చిన వారిది, రెండవభాగం: తమను కలుసుకునే బంధుమిత్రులకు, మూడవభాగం: యాచకులకు, సమాజంలోని నిరుపేదలకు, అగత్యపరులకు ఇవ్వాలి. తమ విభజనను సమర్థిస్తూ ఈ క్రింది హదీసును పేర్కొంటారు. మహనీయ ముహమ్మదు (సఅసం) వారు ఈ విధంగా ప్రవచించారు: “మూడు రోజులకన్నా ఎక్కువగా ఖుర్బానీ మాంసాన్ని నిలువచేసి ఉంచరాదని (లోగడ) నేను మీకు చెప్పి ఉన్నాను. అయితే ఇప్పుడు మీకు ఈ మేరకు అనుమతి ఇవ్వబడుతోంది. మీరు తినగలిగినంత తినండి, సమంజసమైన రీతిలో నిలువ చేసుకోండి.” వేరొక ఉల్లేఖనంలో ఈ పదాలు ఉన్నాయి–“కాబట్టి మీరూ తినండి, నిలువ కూడా చేసుకోండి, దానం కూడా చేయండి.” ఇంకొక ఉల్లేఖనం ఇలా వుంది: “తినండి, తినిపించండి, దానం చేయండి.” (బుఖారీ – కితాబుల్ అజాహీ; ముస్లిం – కితాబుల్ అజాహీ).

ఖుర్బానీ మాంసాన్ని రెండు వాటాలుగా విభజించి, ఒక వాటాను తాముంచుకుని మరో వాటాను దానం చేస్తే సరిపోతుందని కొంతమంది పండితులు భావిస్తున్నారు. వారు తమ ఈ వాదనకు అనుకూలంగా “మీరూ తినండి, దుర్భరస్థితిలో ఉన్న పేదవారికీ తినిపించండి” అని ఇంతకుముందు వచ్చిన ఆయతును ఉదాహరిస్తున్నారు.

అయితే ఒకటి మాత్రం నిజం : రెండు లేక మూడు వాటాలు చెయ్యాలన్న ఆజ్ఞ ఏ ఆయతులోనూ, ఏ హదీసులోనూ ఖచ్చితంగా లేదు. ‘తినండి, తినిపించండి’ అన్న ఆదేశం మాత్రం ఇవ్వబడింది. కాబట్టి ఈ వాటాల విషయంలో మరీ అంత ‘ఇది’గా వ్యవహరించకూడదు. అవసరమున్నచోట ఉదారంగానూ ప్రవర్తించాలి. అవసరం లేదనుకున్నచోట కాస్త అటూ ఇటూగా కూడా వ్యవహరించవచ్చు. ఈ విషయంలో లేనిపోని పట్టింపులకు పోయి, మరీ చాదస్తంగా మసలుకోవలసిన అవసరం లేదు.

అయితే ఖుర్బానీ పశువుల చర్మం విషయంలో మటుకు ఏకాభిప్రాయం ఉంది. దాన్ని తమ అవసరాలకైనా ఉపయోగించాలి లేదా దానమైనా చేయాలి. అంతేగాని

إِنَّ اللَّهَ يُدَٰفِعُ عَنِ الَّذِينَ ءَامَنُوٓا۟ ۗ إِنَّ اللَّهَ لَا يُحِبُّ كُلَّ خَوَّانٍ كَفُورٍ ﴿٣٨﴾

**38** నిశ్చయంగా అల్లాహ్ నికార్సయిన విశ్వాసుల నుండి శత్రువులను పారద్రోలుతాడు.[57] విశ్వాస ఘాతకులైన కృతఘ్నులను అల్లాహ్ సుతరామూ ఇష్టపడడు.

చర్మాన్ని అమ్మి సొమ్ముచేసుకోకూడదు (ముస్నదె అహ్మద్ – 4/15). కాని ఖుర్బానీ చర్మాన్ని స్వయంగా అమ్మి, అలా అమ్మగా వచ్చిన పైకాన్ని నిరుపేదలకు ఇచ్చేందుకు కొంతమంది పండితులు అనుమతించారు (ఇబ్నె కసీర్).

**గమనార్హ విషయం :** దివ్య ఖుర్ఆన్‌లో ఖుర్బానీ ప్రస్తావన హజ్ విధుల సందర్భంగా వచ్చినందున ఖుర్బానీ కేవలం హజ్ యాత్రీకులకు మాత్రమే తప్పనిసరిగా చేయబడిందని కొందరు ప్రబుద్ధులు – ముఖ్యంగా హదీసులను నిరాకరించేవారు– వాదిస్తున్నారు. కాని ఇది వాస్తవం కాదు. ఖుర్బానీ ఇవ్వాలన్న ఆజ్ఞ వేరితర చోట్ల కూడా ఉంది. ఉదాహరణకు: "నీ ప్రభువు కొరకు నమాజు చెయ్యి, ఖుర్బానీ కూడా ఇవ్వు" (కౌసర్ – 2). అంతిమ దైవ ప్రవక్త (సఅసం) వారు ఈ ఆయతుకు భావార్థాన్ని క్రియాత్మకంగా చాటి చెప్పారు. ఆయన (స) స్వయంగా ఏటేటా మదీనాలో జిల్‌హజ్ 10వ తేదీన ఖుర్బానీ ఇచ్చేవారు. ఈ మేరకు సాటి ముస్లింలకు కూడా తాకీదు చేసేవారు. ప్రవక్త ప్రత్యక్ష సహచరులు (రజి) కూడా దీన్ని పాటించేవారు. ఖుర్బానీ ఆచారానికి సంబంధించి అనేక ఉపదేశాలు చేసిన దైవప్రవక్త (స) ఈ ఉపదేశం కూడా చేశారు: "ఈదుల్ అజ్‌హా (బక్రీద్ పండుగ – జిల్ హజ్ 10వ తేదీన) నాడు మనం అన్నిటికన్నా ముందు పండుగ నమాజ్ చేయాలి. ఆ తరువాత వెళ్ళి పశువును జిబహ్ చేయాలి." ఇంకా ఇలా అన్నారు : "ఎవరయితే (పండుగ) నమాజుకు ముందే ఖుర్బానీ ఇచ్చాడో అతను మాంసం తినటానికి తొందరపడ్డాడు. అతని ఖుర్బానీ స్వీకారయోగ్యం కాదు" (బుఖారీ – కితాబుల్ ఈదైన్; ముస్లిం – కితాబుల్ అజాహీ). దీన్నిబట్టి కూడా స్పష్టంగా అవగతమయ్యేదేమిటంటే ముస్లిం అనేవాడు ఎక్కడున్నా ఖుర్బానీ ఆజ్ఞ అతనికి వర్తిస్తుంది. ఎందుకంటే హజ్ యాత్రీకులు, జిల్‌హజ్ 10వ తేదీన పండుగ నమాజు అసలు చేయరు. కాబట్టి 'పండుగ నమాజు అనంతరం ఖుర్బానీ ఇవ్వాలి' అన్న ప్రవక్త (స) ప్రబోధనను బట్టి ఇది సాధారణ ముస్లింలందరికీ వర్తిస్తుందని తేలిపోయింది. అయితే ఖుర్బానీ ఇవ్వటం వాజిబ్ (తప్పనిసరి) కాదు. ఇది 'సున్నతె ముఅక్కద' గా పరిగణించబడుతుంది – ఎందుకంటే ప్రవక్త (స)వారు సాలీనా దీన్ని పాటించేవారు. అలాగే ప్రదర్శనా మనస్తత్వంతో ఒకే ఇంటివారు అనేక పశువులను ఖుర్బానీ ఇవ్వటం కూడా అంతగా అభిలషణీయం కాదు. పైగా అది సున్నత్‌కు విరుద్ధం. హదీసు ప్రకారం ఇంటి సభ్యులందరి తరఫున ఒక పశువును ఖుర్బానీ ఇచ్చినా సరిపోతుంది. ప్రవక్త ప్రియసహచరులు (రజి) కూడా ఇలాగే చేసేవారు (తిర్మిజీ – జిబహ్ అధ్యాయాలు; ఇబ్నుమాజ).

57. హిజ్రీ 6వ సంవత్సరంలో మక్కాకు చెందిన అవిశ్వాసులు తమ ప్రాబల్యాన్ని చూసుకుని

39 ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చేయ బడుతుందో, వారికి(కూడా ప్రతిఘటనకు) అనుమతి ఇవ్వబడుతోంది. ఎందుకంటే వారు (ముస్లిములు) పీడితులు.[58] నిశ్చ యంగా అల్లాహ్ వారిని ఆదుకోగల శక్తి గలవాడు.

أُذِنَ لِلَّذِينَ يُقَاتَلُونَ بِأَنَّهُمْ ظُلِمُوا وَإِنَّ اللَّهَ عَلَىٰ نَصْرِهِمْ لَقَدِيرٌ ﴿٣٩﴾

40 వారు అన్యాయంగా తమ ఇళ్ల నుంచి వెళ్ళగొట్టబడ్డారు. (ఇంతకీ వారు చేసిన నేరం) ఏమిటంటే, "మా ప్రభువు అల్లాహ్" అని పలకటమే. అల్లాహ్యే గనక జనులలో కొందరిని మరికొందరి ద్వారా అడ్డగించి ఉండకపోతే మఠాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు, అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడే మస్జిదులు ధ్వంసం చేయబడేవి. అల్లాహ్కు సహాయపడేందుకు సమా యత్తం అయిన వారికి అల్లాహ్ కూడా తప్పకుండా సహాయపడతాడు. నిశ్చ యంగా అల్లాహ్ మహాబలుడు, సర్వాధిక్యుడు.

الَّذِينَ أُخْرِجُوا مِن دِيَارِهِم بِغَيْرِ حَقٍّ إِلَّا أَن يَقُولُوا رَبُّنَا اللَّهُ ۗ وَلَوْلَا دَفْعُ اللَّهِ النَّاسَ بَعْضَهُم بِبَعْضٍ لَّهُدِّمَتْ صَوَامِعُ وَبِيَعٌ وَصَلَوَاتٌ وَمَسَاجِدُ يُذْكَرُ فِيهَا اسْمُ اللَّهِ كَثِيرًا ۗ وَلَيَنصُرَنَّ اللَّهُ مَن يَنصُرُهُ ۗ إِنَّ اللَّهَ لَقَوِيٌّ عَزِيزٌ ﴿٤٠﴾

కాబా గృహాన్ని సందర్శించకుండా ముస్లింలను అడ్డుకున్నారు. అయితే మరో రెండేళ్ల తరువాత అల్లాహ్ అవిశ్వాసుల ఈ ఆధిక్యతను అణగదొక్కి, ముస్లింల ద్వారా వారిని తొలగించాడు. మక్కా విజయం రూపంలో ముస్లింలు తమ ఆధిక్యతను చాటుకున్నారు. ఆ విధంగా పీడన తొలగిపోయింది.

58. ప్రప్రథమంగా జిహాద్ (ధర్మయుద్ధం) కొరకు అనుమతించబడింది ఈ ఆయతులోనేనని చాలామంది సలఫ్ (తొలికాలం) పండితులు అభిప్రాయపడ్డారు. ఈ ధర్మయుద్ధం లక్ష్యాలు రెండు. ఒకటి : పీడనను రూపుమాపటం. రెండు : దైవవాక్కు వర్ధిల్లేలా చేయటం. పీడితులకు గనక సహాయం చేసి, చేయూతనివ్వకపోతే బలవంతులు వారిని బ్రతకనివ్వరు. అధికార మదాంధులు నిర్వాసితులను నేలపై నిలువనీడ లేకుండా చేసేస్తారు. తత్కారణంగా సర్వత్రా అరాచకం, అల్లకల్లోలం మొదలవుతుంది. జీవితం దుర్భరమైపోతుంది. రాజ్యం నరకతుల్యమైపోతుంది.

**41** (ఈ విశ్వాసులు ఎలాంటివారంటే) మేము గనక వారికి భూమిలో అధికారాన్ని ప్రసాదిస్తే వారు ఖచ్చితంగా నమాజును నెలకొల్పుతారు. జకాతు (అనే విధ్యుక్త దానధర్మాన్ని) చెల్లిస్తారు. మంచి పనులు చేయమని ఆజ్ఞాపిస్తారు. చెడు పనుల నుంచి ఆపుతారు.[59] సమస్త వ్యవహారాల ఫలితం అల్లాహ్ అధీనంలోనే ఉంది.[60]

الَّذِينَ إِن مَّكَّنَّاهُمْ فِي الْأَرْضِ أَقَامُوا الصَّلَاةَ وَآتَوُا الزَّكَاةَ
وَأَمَرُوا بِالْمَعْرُوفِ وَنَهَوْا عَنِ الْمُنكَرِ ۗ وَلِلَّهِ عَاقِبَةُ
الْأُمُورِ ﴿٤١﴾

అలాగే దైవవాక్కు ఉన్నతికోసం పాటుపడుతూ ముష్కరుల మెడలు వంచకపోతే నీతికి నిలువ నీడలేకుండా పోతుంది. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణిస్తాయి. దైవనామాన్ని స్మరించే వారికోసం భూమిపై ప్రార్థనా స్థలం లేకుండా పోతుంది. (మరిన్ని వివరాల కోసం అల్ బఖరా సూరా 251వ ఆయతుకు ఇవ్వబడిన వివరణను చూడండి). **"సవామివు"** (صَوَامِعُ) అనేది "సౌమఅతున్"కు బహువచనం. చిన్న చిన్న చర్చీలని దాని అర్థం. **"బియవున్"** (بِيَعٌ) అంటే పెద్ద చర్చీలు, **"సలవాత్"** అనేవి యూదుల ఆరాధనాలయాలు. ఇకపోతే "మసాజిద్"లు ముస్లింల ప్రార్థనా స్థలాలు.

59. ఈ ఆయతులో ఇస్లామీయ ప్రభుత్వ మౌలిక ఉద్దేశాలు, ఆశయాలు, లక్ష్యాలు విశదీకరించబడ్డాయి. మార్గదర్శక ఖలీఫాలు ఏలిన తొలికాలంలో ఈ అంశాలన్నీ అమల్లోకి వచ్చాయి. పరిపాలకులు తమ ప్రాథమ్యాల్లో వీటిని (నమాజు, జకాతు, మంచినిపెంచటం, చెడులను నిర్మూలించటం) చేర్చి ప్రణాళికాబద్ధంగా అమలు పరిచారు. తత్ఫలితంగా ఆ ప్రభుత్వాల ద్వారా శాంతి భద్రతలు నెలకొల్పబడ్డాయి. ప్రజలు సుఖజీవితం గడిపారు. వారికి ప్రపంచంలో గౌరవోన్నతులు లభించాయి. నేటికీ సవూదీ అరేబియాలాంటి దేశాలలో ఈ విషయాలు ప్రభుత్వ స్థాయిలో అమలు పరచబడుతున్నాయి. దీనిమూలంగా ఆ రాజ్యాలు శాంతి భద్రతల రీత్యా, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రపంచంలో మంచి రాజ్యాలుగా పరిగణించబడుతున్నాయి. అదేసమయంలో మరికొన్ని ముస్లిం రాజ్యాలలో సంక్షేమ రాజ్యస్థాపనకు సంబంధించి గొంతు బొంగురుపోయేలా కొందరు అరుస్తూ ఉన్నారు. ఆకర్షణీయమైన నినాదాలను కూడా ఆవిష్కరిస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రతి పరిపాలకుడూ – వచ్చిన కొత్తలో – శ్రేయోరాజ్యం గురించి తియ్యని కబుర్లు చెబుతాడు. కాని వాస్తవాల్ని తరచిచూస్తే ప్రతి ముస్లిం రాజ్యంలోనూ అరాచకం, అవ్యవస్థ, అశాంతి, అసంతృప్తి, అధోగతి, హత్యలు, దోపిడీలు, దొమ్మీలు, కుమ్ములాటలు అనుదినం ఎక్కువైపోతు న్నాయి. కారణం సుస్పష్టమే – వారిలో ప్రతి ఒక్కరూ దేవుడు చూపిన

**42** (ఓ ప్రవక్తా!) ఒకవేళ వీళ్లు నిన్ను ధిక్కరిస్తే (ఆశ్చర్యపోనవసరం లేదు), వీరికి పూర్వం నూహ్, ఆద్, సమూద్ జాతుల వారు ధిక్కరించి ఉన్నారు.

وَإِن يُكَذِّبُوكَ فَقَدْ كَذَّبَتْ قَبْلَهُمْ قَوْمُ نُوحٍ وَعَادٌ وَثَمُودُ ﴿٤٢﴾

**43** అలాగే ఇబ్రాహీమ్ జాతివారు, లూతు జాతి వారు,

وَقَوْمُ إِبْرَاهِيمَ وَقَوْمُ لُوطٍ ﴿٤٣﴾

**44** మద్యన్ వారు కూడా (తమ తమ ప్రవక్తలను ధిక్కరించారు). మూసా కూడా ధిక్కరించబడ్డాడు. నేను అవిశ్వాసులకు కాస్త విడుపు ఇచ్చాను. ఆ తరువాత వారిని పట్టుకున్నాను.[61] మరి నా శిక్ష (వారిపై) ఎలా పడిందో! (చూశావుగా!)[62]

وَأَصْحَابُ مَدْيَنَ ۖ وَكُذِّبَ مُوسَىٰ فَأَمْلَيْتُ لِلْكَافِرِينَ ثُمَّ
أَخَذْتُهُمْ ۖ فَكَيْفَ كَانَ نَكِيرِ ﴿٤٤﴾

మార్గాన్ని అవలంబించే బదులు పాశ్చాత్య ప్రజాస్వామిక పంథాను, ధర్మరాహిత్య, నీతిరాహిత్య విధానాలను అనుసరిస్తూ తమ లక్ష్యాలను ఛేదించాలనుకుంటున్నారు. ఇది ఆకాశానికి నిచ్చెన వేయటం లాంటిది మాత్రమే. ముస్లిం రాజ్యాలు ఖుర్ఆన్ చూపే మార్గదర్శక నియమాలను అనుసరించి నమాజు జకాతు వ్యవస్థల్ని స్థాపించనంతవరకూ, సత్సమాజస్థాపన కోసం నడుం బిగించనంతవరకూ, తమ ప్రణాళికలలో ఈ అంశాలను అగ్రస్థానంలో ఉంచనంతవరకూ అవి సిసలయిన శ్రేయో రాజ్యాన్ని స్థాపించలేవు. అప్పటివరకూ అది కుందేటి కొమ్ములాగా, కాల్పనిక వ్యవస్థ (Utopia) లాగానే ఉంటాయి.

60. ప్రపంచంలో ఏం జరిగినా, ఎక్కడ ఏ మార్పు వచ్చినా అల్లాహ్ ఆజ్ఞతోనే వస్తుంది. ప్రతి చర్యలోనూ ఆయన యుక్తి, పరమార్థం దాగి ఉంటుంది. ఆయన ఆజ్ఞ అవకుండా ఒక్క ఆకు కూడా కదలదు. అలాంటప్పుడు ఎవరయినా అల్లాహ్ ఆజ్ఞల్ని, నియమాల్ని కాదని సిసలైన సాఫల్యాన్ని పొందగలం అని అనుకుంటే అది వారి అవివేకం అనాలి.

61. ఇవి అంతిమ దైవప్రవక్త (సఅసం)ను ఓదార్చటానికి దేవుడు పలికిన మాటలు. ఈ మక్కా తిరస్కారులు నీ సందేశాన్ని ధిక్కరించటం కొత్త విషయమేమీ కాదు. వెనుకటి జాతులు కూడా తమ ప్రవక్తల మాటలను ధిక్కరించేవి. నేను కూడా వారికి అవకాశం ఇస్తూపోయాను. మరి వారికివ్వబడిన గడువు ముగియగానే అకస్మాత్తుగా వారి భరతం పట్టాను. వారి పట్టణాలను, వారి సాంస్కృతిక చిహ్నాలను, వారి అపురూపమైన కళాఖండాలను నేలమట్టం చేసేశాను – ఈ మాటల ద్వారా అల్లాహ్ మక్కాలోని అవిశ్వాసులను పరోక్షంగా హెచ్చరిస్తున్నాడు. ఓ మక్కా అవిశ్వాసులారా! ఈనాడు

**45** ఎన్నో పట్టణాలను మేము తుడిచి పెట్టేశాము. ఎందుకంటే అవి దుర్మార్గానికి ఒడిగట్టాయి. అవి తమ కప్పులపై తల క్రిందులుగా పడి ఉన్నాయి. ఎన్నో బావులు పాడుపడి ఉన్నాయి. మరెన్నో పటిష్టమైన, ఎత్తైన మేడలు నిర్మానుష్యంగా ఉన్నాయి.

فَكَأَيِّن مِّن قَرْيَةٍ أَهْلَكْنَاهَا وَهِيَ ظَالِمَةٌ فَهِيَ خَاوِيَةٌ عَلَىٰ عُرُوشِهَا
وَبِئْرٍ مُّعَطَّلَةٍ وَقَصْرٍ مَّشِيدٍ ﴿٤٥﴾

**46** ఏమిటీ, వారు భూమిలో సంచరించలేదా? (ఒకవేళ తిరిగి చూచినట్లయితే) వారి హృదయాలు ఆ విషయాలను గ్రహించగలిగేవి, లేదా వారి చెవులు (ఆ సంఘటనలను గురించి) విని ఉండేవి. అసలు విషయం ఏమిటంటే కళ్లు మాత్రమే గుడ్డివై ఉండవు, రొమ్ములలో ఉన్న హృదయాలు గుడ్డివి అవుతాయి.[63]

أَفَلَمْ يَسِيرُوا فِي الْأَرْضِ فَتَكُونَ لَهُمْ قُلُوبٌ يَعْقِلُونَ بِهَا أَوْ
آذَانٌ يَسْمَعُونَ بِهَا ۖ فَإِنَّهَا لَا تَعْمَى الْأَبْصَارُ وَلَٰكِن
تَعْمَى الْقُلُوبُ الَّتِي فِي الصُّدُورِ ﴿٤٦﴾

**47** (దైవ) శిక్ష కోసం వారు నిన్ను తొందర పెడుతున్నారు. అల్లాహ్ ఎట్టిపరిస్థితి లోనూ తన వాగ్దానానికి విరుద్ధంగా చేయడు. కాకపోతే నీ ప్రభువు దగ్గర ఒకరోజు (అంటే) మీరు లెక్కించే వెయ్యేండ్లకు సమానం.[64]

وَيَسْتَعْجِلُونَكَ بِالْعَذَابِ وَلَن يُخْلِفَ اللَّهُ وَعْدَهُ ۚ وَإِنَّ يَوْمًا
عِندَ رَبِّكَ كَأَلْفِ سَنَةٍ مِّمَّا تَعُدُّونَ ﴿٤٧﴾

మీరు మీ అంతిమ దైవప్రవక్త (స)ను ధిక్కరించిన మీదట కూడా బతికిపోతున్నారంటే నేను కనికరిస్తున్నానని సంబరపడకండి. కొంతకాలం అవకాశం ఇవ్వటం నా సంప్రదాయం. మీ పూర్వీకులకు కూడా ఇలాగే కొంత వ్యవధి ఇచ్చాము. ఈలోగా వారు పశ్చాత్తాపం చెంది, క్షమాపణ కోరుకుని రుజువర్తనులైతే సరి. లేకపోతే అమాంతం మా శిక్షా కొరడాను ఝళిపిస్తాము. ముస్లింల ద్వారా ఓడించి, పరాభవానికి లోనుచేస్తాము అని దేవుడు సంకేతప్రాయంగా చెబుతున్నాడు.

62. వారి తలబిరుసుతనం మితిమీరినపుడు మేము ఏవిధంగా పట్టుకున్నామో, దాని పరిణామం ఏమయిందో చూసి గుణపాఠం నేర్చుకోండి అన్నది దీని భావం.

63. ఏ జాతి అయినా మార్గవిహీనత యొక్క ఆఖరి అంచులకు వెళ్ళిపోయినప్పుడు గుణపాఠం గ్రహించే దక్షతను అది కోల్పోతుంది. తత్కారణంగా గతించిన దుర్మార్గ జాతుల లాగా ఈ జాతి కూడా వినాశానికి ఆహుతి అవుతుంది.

**48** ఎన్నో పట్టణాలకు, అవి దారుణంగా చెలరేగిపోయినప్పటికీ నేను ఒకింత విడుపు ఇచ్చాను. తర్వాత వారిని పట్టు కున్నాను. వారు తిరిగి రావలసింది నా దగ్గరకే కదా![65]

وَكَاَيِّنْ مِّنْ قَرْيَةٍ اَمْلَيْتُ لَهَا وَهِيَ ظَالِمَةٌ ثُمَّ اَخَذْتُهَا ۚ وَاِلَيَّ الْمَصِيْرُ ﴿٤٨﴾

**49** (ఓ ప్రవక్తా!) ఇలా ప్రకటించు : "ఓ మానవులారా! నేను మిమ్మల్ని స్పష్టంగా సావధానపరచేవాడిని మాత్రమే."[66]

قُلْ يٰۤاَيُّهَا النَّاسُ اِنَّمَاۤ اَنَا لَكُمْ نَذِيْرٌ مُّبِيْنٌ ۚ ﴿٤٩﴾

మనిషి ఆలోచనలకు, మనోభావాలకు హృదయం కేంద్రబిందువు వంటిది. మెదడు కేంద్రబిందువు అని మరికొందరంటారు. ఇవి రెండూ కీలకపాత్ర వహిస్తాయని ఇంకా కొందరు చెబుతున్నారు (ఫత్‌హుల్ ఖదీర్, ఐసరుత్తఫాసీర్).

64. వాళ్లు తమ లెక్కల ప్రకారం ఆత్రం చేస్తున్నారు. కాని అల్లాహ్ దృష్టిలో ఒకరోజు ప్రపంచవాసుల వెయ్యేండ్లకు సమానం. ఆ లెక్కన ఆయన గనక ఏ జాతివారికయినా 24 గంటలు గడువు ఇస్తే వెయ్యేండ్ల గడువు ఇచ్చినట్లే. 12 గంటల అవకాశం ఇస్తే 500 సంవత్సరాలు, 6 గంటల విడుపు ఇస్తే 250 సంవత్సరాల గడువు ఇచ్చినట్లు లెక్ఖ. అలాగే అల్లాహ్ ఏ సముదాయానికైనా ఒక గంట సమయం ఇచ్చాడంటే ఇంచుమించు 40 సంవత్సరాల కాలం వరకు వదలిపెట్టాడని అనుకోవాలి (ఐసరుత్తఫాసీర్).

దీనికి మరో అర్థం ఇది : అల్లాహ్ శక్తిముందు ఒకరోజు అయినా – వెయ్యేండ్లయినా ఒక్కటే. వీళ్లు తొందరపెడుతున్నారు. ఆయనేమో ఆలస్యం చేస్తున్నాడు. అయితే ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చటం మాత్రం ఖాయం.

మరికొంతమంది దీన్ని పరలోక విషయంగా పరిగణించారు. అత్యంత భయంకరమైన తీర్పుదినం–అది ఒక్క రోజే అయినా–వెయ్యేండ్లుగా, మరికొందరికి 50 వేల సంవత్స రాలుగా అనిపిస్తుందని వ్యాఖ్యానించారు. కాగా; అంతిమదినం నిజంగానే వెయ్యి సంవత్సరాలకు సమానంగా ఉంటుందని ఇంకా కొంతమంది అభిప్రాయపడ్డారు.

65. అందుకే దేవుడు ఆ విషయాన్ని ఇక్కడ మరోసారి జ్ఞాపకం చేశాడు. వారెన్ని పిచ్చివేషాలు వేసినా, ఎంతగా బరితెగించి ప్రవర్తించినా నాకు పట్టుబడకుండా ఎక్కడికీ పోలేరు. ఆఖరికి వారు రావలసింది నావద్దకే. వేరొక చోటికి పారిపోలేరు.

66. అవిశ్వాసులు, ముష్రిక్కులు దైవశిక్షకోసం పెడుతున్న తొందరకు సమాధానంగా దైవప్రవక్త చెప్పిన మాటలివి : "మిమ్మల్ని మేల్కొల్పటం వరకే నా బాధ్యత. శిక్షను

**50** కనుక విశ్వసించి, సత్కార్యాలు చేసిన వారికే మన్నింపు, గౌరవప్రదమైన ఉపాధి లభిస్తాయి.

فَالَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ لَهُمْ مَّغْفِرَةٌ وَّرِزْقٌ كَرِيْمٌ ﴿٥٠﴾

**51** మరి మా ఆయతులను లొంగదీసుకోవటానికి ప్రయత్నించేవారు[67] – వారే నరక వాసులవుతారు.

وَالَّذِيْنَ سَعَوْا فِيْۤ اٰيٰتِنَا مُعٰجِزِيْنَ اُولٰۤئِكَ اَصْحٰبُ الْجَحِيْمِ ﴿٥١﴾

**52** (ఓ ప్రవక్తా!) మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను, లేదా ఏ సందేశహరుణ్ణి పంపినా –అతను తన మనసులో ఏదైనా సంకల్పం చేసుకున్నప్పుడల్లా షైతాను అతని సంకల్పంలో ఏదో ఒకటి కలుషితం చేసేవాడు. మరయితే అల్లాహ్ షైతాన్ కల్తీని పారద్రోలి, తన వచనాలను స్థిర పరుస్తాడు.[68] అల్లాహ్ సర్వం తెలిసినవాడు, వివేక సంపన్నుడు.

وَمَاۤ اَرْسَلْنَا مِنْ قَبْلِكَ مِنْ رَّسُوْلٍ وَّلَا نَبِيٍّ اِلَّاۤ اِذَا تَمَنّٰۤى اَلْقَى الشَّيْطٰنُ فِيْۤ اُمْنِيَّتِهٖ ۚ فَيَنْسَخُ اللّٰهُ مَا يُلْقِى الشَّيْطٰنُ ثُمَّ يُحْكِمُ اللّٰهُ اٰيٰتِهٖ ؕ وَاللّٰهُ عَلِيْمٌ حَكِيْمٌ ۙ ﴿٥٢﴾

అవతరింపజేసే బాధ్యత అల్లాహ్పై ఉంది. శీఘ్రంగా శిక్షించినా, ఆలస్యంగా శిక్షించినా – అది ఆయన ఇష్టం. ఆయన తన యుక్తికీ, ప్రణాళికకు కట్టుబడి ఈ పని చేస్తాడు. అది ఎప్పుడు సంభవిస్తుందో ఆయనకే ఎరుక. ఆయనకు తప్ప ఇతరులకు దాని గురించి ఏమాత్రం తెలీదు.

ఈ ఉపదేశం మక్కావాసులకు చేయబడుతున్నప్పటికీ, మహాప్రవక్త (సఅసం) సమస్త మానవాళికీ మార్గదర్శకునిగా, సందేశహరునిగా పంపబడటం వల్ల "ఓ మానవులారా!" అని సంబోధించారు. దీన్నిబట్టి బోధపడేదేమిటంటే ఈ వాక్యం మక్కా అవిశ్వాసుల మాదిరిగా ప్రవర్తించే ప్రపంచ ముష్రిక్కులకు, అవిశ్వాసులందరికీ ప్రళయదినం వరకూ వర్తిస్తుంది.

67. **"ముఆజిజీన"** ( مُعٰجِزِيْنَ ) అంటే దైవనిదర్శనాలను లొంగదీసుకోగలమనీ, అణచివేయగలమని వారు అనుకుంటున్నారు. ఎన్ని వెర్రి వేషాలు వేసినా మేము వారిని పట్టుకోలేమని బహుశా వారు తలపోస్తున్నారు. మరణానంతర జీవితంపై, తీర్పుదినంపై నమ్మకం లేనందునే వారిలో ఇంతటి ధీమా వచ్చింది. మితిమీరిన ఈ ధీమాయే వారి కొంపముంచబోతుంది. వారు నరకానికి ఆహుతి కావలసినవారే.

68. **'తమన్నా'** ( تَمَنّٰى ) అంటే అభిలాష, ఆకాంక్ష అని అర్థం. పఠనం అని కూడా ఒక అర్థం వస్తుంది. **'ఉమ్నియ్యతున్'** అనే పదం అందులో నుంచి పుట్టినదే. కనుక

لِيَجْعَلَ مَا يُلْقِي الشَّيْطٰنُ فِتْنَةً لِّلَّذِيْنَ فِيْ قُلُوْبِهِمْ
مَّرَضٌ وَّالْقَاسِيَةِ قُلُوْبُهُمْ ؕ وَاِنَّ الظّٰلِمِيْنَ لَفِيْ شِقَاقٍۭ
بَعِيْدٍ ۙ﴿۵۳﴾

**53** ఎవరి హృదయాలలో రోగం ఉందో, మరెవరి గుండెలు కరకు గుండెలుగా మారిపోయాయో వారిని ఈ షైతాను కలిపేదాని ద్వారా పరీక్షించటానికి[69] అల్లాహ్ (ఇదంతా చేశాడు). నిశ్చయంగా దుర్మార్గులు వ్యతిరేకతలో చాలా దూరం వెళ్ళిపోయారు.

وَّلِيَعْلَمَ الَّذِيْنَ اُوْتُوا الْعِلْمَ اَنَّهُ الْحَقُّ مِنْ رَّبِّكَ
فَيُؤْمِنُوْا بِهٖ فَتُخْبِتَ لَهٗ قُلُوْبُهُمْ ؕ وَاِنَّ اللّٰهَ
لَهَادِ الَّذِيْنَ اٰمَنُوْۤا اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿۵۴﴾

**54** జ్ఞాన మొసగబడినవారు, ఇది నీ ప్రభువు తరఫునుంచి వచ్చిన సత్యం అని తెలుసుకుని, దాన్ని విశ్వసించటానికి, ఇంకా వారి హృదయాలు ఆయన వైపుకు మొగ్గటానికి (కూడా ఈ విధంగా చేయ బడింది).[70] నిశ్చయంగా అల్లాహ్ విశ్వసిం చినవారికి రుజుమార్గం వైపునకు దర్శ కత్వం వహిస్తాడు.[71]

దీనికి ఆకాంక్ష, కోరిక, సంకల్పం, తలంపు లేక పఠనం అన్న అర్థాలు వస్తాయి.

మొదటి అర్థాన్ని తీసుకుంటే ఆయతు భావం ఇలా ఉంటుంది : వారి సంకల్పంలో షైతాన్ అవరోధం కల్పించి, ఆ పని జరగకుండా చూడాలని ప్రయత్నిస్తాడు. వీలైనంత మంది ప్రజలు విశ్వసించి, సాఫల్యం పొందాలన్నది దైవప్రవక్తల ఆకాంక్ష అయి ఉంటుంది. కాగా; షైతాన్ ఇందులో అవరోధాలు సృష్టించి వీలైనంతమందిని సన్మార్గం లోకి రాకుండా చూడాలనుకుంటాడు.

రెండవ అర్థం తీసుకుంటే ఆయతు భావం ఇదవుతుంది : దైవప్రవక్త లేక నబీ ఎప్పుడు తన వద్దకు వచ్చిన దైవసందేశాన్ని పఠించి జ్ఞాపకం చేసుకోగోరినా షైతాను అతని పారాయణంలో చెడు ప్రేరణలు కల్పించి దైవవాక్కులను కలగాపులగం చేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తాడు లేదా దివ్య వచనాల గురించి ప్రజలలో లేనిపోని సందేహాలను, అనుమానాలను నూరిపోస్తాడు. అయితే ఎట్టకేలకు అల్లాహ్ షైతాను కుయుక్తులన్నింటినీ వమ్ముచేసి తన వచనాలను పటిష్టం చేస్తాడు.

ఈ ఆయతు ద్వారా దేవుడు తన అంతిమ ప్రవక్త (స)కు చెప్పదలచిన అసలు విషయం ఇది : షైతాను ఆగడాలు ఒక్క నీ విషయంలోనే జరగలేదు. నీకు మునుపు

**55** తమపై అకస్మాత్తుగా ప్రళయ ఘడియ వచ్చిపడేవరకూ లేదా తమ వద్దకు అశుభ దినపు శిక్ష[72] వచ్చేవరకూ అవిశ్వాసులు దైవసందేశం (వహీ) గురించి సంశయం లోనే పడి ఉంటారు.

وَلَا يَزَالُ الَّذِينَ كَفَرُوا فِي مِرْيَةٍ مِّنْهُ حَتَّىٰ تَأْتِيَهُمُ السَّاعَةُ بَغْتَةً أَوْ يَأْتِيَهُمْ عَذَابُ يَوْمٍ عَقِيمٍ ﴿٥٥﴾

**56** ఆ రోజు సర్వసత్తాధికారం అల్లాహ్‌దే.[73] ఆయనే వారి మధ్య తీర్పులు చేస్తాడు. మరి విశ్వసించి, సత్కార్యాలు చేసినవారు వరాలు నిండిన స్వర్గ వనాలలో ఉంటారు.

الْمُلْكُ يَوْمَئِذٍ لِّلَّهِ يَحْكُمُ بَيْنَهُمْ ۚ فَالَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ فِي جَنَّاتِ النَّعِيمِ ﴿٥٦﴾

**57** విశ్వసించకుండా, మా ఆయతులను ధిక్కరించినవారి కోసం అవమానభరిత మైన శిక్ష ఉంది.

وَالَّذِينَ كَفَرُوا وَكَذَّبُوا بِآيَاتِنَا فَأُولَٰئِكَ لَهُمْ عَذَابٌ مُّهِينٌ ﴿٥٧﴾

వచ్చిన ప్రవక్తలందరిపట్లా ఆ ధూర్తుడు ఇలాగే ప్రవర్తించాడు. అయితే (ఓ ముహమ్మద్!) నువ్వు ఆందోళన చెందనవసరం లేదు. షైతాను కుట్రలు, కుతంత్రాల నుంచి మేము పూర్వపు ప్రవక్తలను కాపాడినట్లే నిన్ను కూడా కాపాడుతాము. షైతానుకు ప్రతిగా అల్లాహ్ తన వాక్కును స్థిరపరుస్తాడు.

69. ప్రజలను అపమార్గానికి లోను చేయటం షైతాన్ లక్ష్యం. అయితే ప్రజలంతా వాడి మాయమాటల్లో పడరు. హృదయాలలో కాపట్య రోగం ఉన్నవారు, వక్ర మనస్కులు, నిరంతరం పాపకార్యాలు చేసి హృదయాలలో కాఠిన్యం ఏర్పడిన వారు మాత్రమే వాడి ఎత్తులకు చిత్తవుతారు.

70. షైతాన్ దుష్ప్రేరణలు కాపట్యరోగానికి, హృదయ కాఠిన్యానికి, కుఫ్ర్‌కు గురై ఉన్నవారిలో మరింత సందిగ్ధాన్ని సృష్టించగా మరోవైపు జ్ఞానామృతాన్ని ఆస్వాదించిన వారి విశ్వాసం, నమ్మకం దీనివల్ల మరింత దృఢమవుతుంది. దేవుని తరపున అవతరింప జేయబడిన ఖుర్ఆన్ సత్యబద్ధమైన గ్రంథం అని వారు గట్టిగా నమ్ముతారు. అందువల్ల వారి హృదయాలు దైవసన్నిధిలో కరిగిపోతాయి.

71. ఇహంలోనూ, పరంలోనూ ఆయన వారికి మార్గదర్శకత్వం వహిస్తాడు. ఇహలోకంలో సత్యాన్ని ఆస్వాదించి, అనుసరించే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు. అసత్యాన్ని పరికించే తెలివితేటల్ని వారికి ఇస్తాడు. అంతేకాదు, అసత్యం నుండి, అధర్మం నుండి వారిని కాపాడుతాడు కూడాను. ఇక పరలోకంలో ఆయన వహించే మార్గదర్శకత్వం ఏమి టంటే వారిని వ్యధాభరితమైన నరకయాతన నుండి కాపాడి స్వర్గంలో ప్రవేశం

وَالَّذِيْنَ هَاجَرُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ ثُمَّ قُتِلُوْٓا اَوْ مَاتُوْا لَيَرْزُقَنَّهُمُ اللّٰهُ رِزْقًا حَسَنًا ؕ وَاِنَّ اللّٰهَ لَهُوَ خَيْرُ الرّٰزِقِيْنَ ﴿۵۸﴾

**58** ఎవరయితే అల్లాహ్ మార్గంలో (స్వస్థలాన్ని వదలి) వలసపోయారో, తరువాత చంపబడ్డారో లేదా చనిపోయారో,[74] వారికి అల్లాహ్ అత్యుత్తమమైన ఉపాధిని ప్రసాదిస్తాడు.[75] నిస్సందేహంగా అల్లాహ్ మాత్రమే ఉపాధి ప్రదాతలలోకెల్లా శ్రేష్ఠుడు.[76]

కల్పిస్తాడు. అక్కడ వారి మనసు మెచ్చిన భోగభాగ్యాలను వారికి అనుగ్రహిస్తాడు. తన దర్శన భాగ్యాన్ని కూడా వారికి కల్పిస్తాడు. అల్లాహ్ ఆ భాగ్యాన్ని మనక్కూడా ప్రసాదించుగాక!

72. ఆయతులో **"యౌమిన్ అఖీమ్"** ( يَوْمٍ عَقِيْمٍ ) అని వుంది. అంటే వంధ్యదినం (గొడ్రాలు అయిన దినం) అని అసలు అర్థం. ఆ రోజు తరువాత ఇక రోజులనేవి ఉండవు గనక ఆ విధంగా అనబడింది. దీనికి మరో అర్థం ఏమిటంటే ఆ రోజు అవిశ్వాసులపై ఎలాంటి జాలి, దయ కనబరచబడదు. ఆ రోజు వారికెలాంటి శుభం కలుగదు – అంతా అశుభమే. ఒకప్పుడు ఇహలోకంలో శిక్షగా వస్తూ ఉండే ఫలరహితమైన గాలి ఎటువంటిదో ఇదీ అంతే. "అప్పుడు మేము వారిపై నిష్ఫలమైన గాలిని పంపాము" అన్న ఆయతు గమనార్హం (అజ్జారియాత్–41). అంటే ఆ గాలి ఫలవంతమైనది కాదు, దానివల్ల వర్షం కురవదు, పైరుకు ఎలాంటి బలం కూడా చేకూరదు. జనుల ఆరోగ్యానికి కూడా అది మేలు చేకూర్చదు.

73. ప్రపంచంలో కొంతమందికి తాత్కాలికంగానో, కానుక రూపంలోనో, లేక పరీక్షగానో రాజ్యాధికారం ఇవ్వబడుతుంది. పదవోన్నతి జరుగుతుంది. కాని పరలోక సార్వభౌమత్వం మాత్రం ఎవరికీ లభించదు. ఈ సర్వాధిపత్యం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంటుంది. "ఆ రోజున నిజమైన రాజ్యాధికారం కేవలం కరుణామయుని చేతుల్లో ఉంటుంది. అది అవిశ్వాసులకు ఎంతో కఠినమైన రోజు అయి ఉంటుంది." (అల్ ఫుర్ఖాన్ – 26).

"ఈ రోజు సార్వభౌమత్వం ఎవరిది? (అని అల్లాహ్ ప్రశ్నిస్తాడు). "తిరుగులేని ఒక్కడైన అల్లాహ్‌దే" (అని ఆయన స్వయంగా చెబుతాడు). (మోమిన్ – 16)

74. అంటే వారు తమ ఇల్లూవాకిలిని వదలి – దైవమార్గంలో – వేరొకచోటికి తరలి పోతున్నప్పుడు వారు మరణించినా లేక ఎవరయినా వారిని వధించినా....

75. అంటే అల్లాహ్ ప్రసాదించే స్వర్గలోక భాగ్యాలు. అవి ఎన్నటికీ తరగనివి, కరగనివి.

76. ఎందుకంటే దేవుడు లెక్కలేనంతగా ప్రసాదించేవాడు. ప్రతిభను బట్టి ప్రసాదించటం,

لَيُدْخِلَنَّهُمْ مُّدْخَلًا يَّرْضَوْنَهٗ ۗ وَاِنَّ اللّٰهَ لَعَلِيْمٌ
حَلِيْمٌ ﴿٥٩﴾

ذٰلِكَ ۚ وَمَنْ عَاقَبَ بِمِثْلِ مَا عُوْقِبَ بِهٖ ثُمَّ بُغِيَ
عَلَيْهِ لَيَنْصُرَنَّهُ اللّٰهُ ۗ اِنَّ اللّٰهَ لَعَفُوٌّ غَفُوْرٌ ﴿٦٠﴾

**59** వారు ఇష్టపడే చోటికి[77] ఆయన వారిని చేరుస్తాడు. అల్లాహ్ అన్నీ తెలిసిన వాడు, ఓరిమి కలవాడు.[78]

**60** ఇదీ (వారికి లభించే పుణ్యఫలం).[79] తనకు బాధపెట్టబడిన మేరకే ప్రతీకారం తీర్చుకున్న వ్యక్తిపై తిరిగి దౌర్జన్యం జరిపితే, అప్పుడు అల్లాహ్ స్వయంగా అతనికి తోడ్పడతాడు.[80] నిశ్చయంగా అల్లాహ్ మన్నించి వదలిపెట్టేవాడు, క్షమాభిక్షపెట్టేవాడూను.[81]

అడిగితేనే ఇవ్వటం అనేవి ఉండవు. ప్రపంచంలో మనుషులు ఒకరు ఇంకొకరికి ఏదన్నా ఇచ్చినా వాస్తవానికి వారు దైవప్రసాదితమైన దాన్నే ఇస్తారు. ఈ విషయంలో కూడా సిసలైన ఉపాధిప్రదాత అల్లాహ్ మాత్రమే.

77. స్వర్గలోక అనుగ్రహాలు అద్భుతమైనవి. వాటిని ఈనాటివరకూ ఏ కన్నూ కానలేదు. వాటిని గురించి ఏ చెవీ వినలేదు. చూడటం, వినటం సంగతి అటుంచండి, ఏ మానవ హృదయమూ వాటిని గురించి ఊహించనైనా లేదు. మరి అటువంటి అద్భుతమైన – అనుగ్రహభరితమైన – స్థలాన్ని చూచినమీదట ఎవరయినా సంతోషించకుండా ఎలా ఉంటారు!?

78. **'అలీమ్'** ( عَلِيْمٌ ) (అన్నీ తెలిసినవాడు). సత్కార్యాలు చేసిన వారికి ఏ ఏ అంతస్థులు కేటాయించాలో, ఎవరు ఏ కోవకు చెందినవారో అల్లాహ్‌కు అంతా తెలుసు. అదే సమయంలో ఆయన మృదుస్వభావి, సహనశీలి కూడాను. ఎందుకంటే బహుదైవోపాసకుల, సత్యతిరస్కారుల వెకిలిచేష్టలను గమనిస్తూ కూడా ఆయన తక్షణం వారిపై తన కొరడాను ఝుళిపించటం లేదు. వారికి గడువు ఇస్తూ పోతున్నాడు.

79. అంటే దైవమార్గంలో వలసపోయిన వారు సహజ మరణం చెందినా లేక ఇతరులచేత చంపబడినా – వారికి అనుగ్రహాలు ప్రసాదిస్తామని మేము చేసిన వాగ్దానం తప్పక నెరవేరుతుంది.

80. అంటే ఎవరయినా ఎవరికయినా అన్యాయంగా బాధపెడితే, బాధితునికి తనకు కలిగిన బాధకు సమానంగా ప్రతీకారం తీర్చుకునే హక్కు ఉంది. ప్రతీకారం తీర్చుకున్న పిదప – బాధించినవాడూ, పీడితుడు ఇద్దరికీ చెల్లు అయిపోయిన తరువాత – బాధితునిపై మరోసారి దౌర్జన్యం చేస్తే అట్టి పరిస్థితిలో అల్లాహ్ బాధిత వ్యక్తికి తప్పక సహాయం చేస్తాడు.

బాధితుడు న్యాయసమ్మతంగా తీర్చుకున్న ప్రతీకారాన్ని తప్పుపట్టాల్సిన అవసరం

**61** అల్లాహ్ రాత్రిని పగటిలోనూ, పగటిని రాత్రిలోనూ ప్రవేశింపజేస్తూ ఉండటం వల్లనూ,[82] నిశ్చయంగా అల్లాహ్ వినే వాడు, చూచేవాడవటం వల్లనూ ఈ విధంగా జరుగుతోంది.

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ يُوْلِجُ الَّيْلَ فِى النَّهَارِ وَيُوْلِجُ النَّهَارَ
فِى الَّيْلِ وَاَنَّ اللّٰهَ سَمِيْعٌۢ بَصِيْرٌ ﴿٦١﴾

**62** ఇంకా అల్లాహ్‌యే సత్యం అవటం మూలంగా,[83] అల్లాహ్‌ను వదలి వారు మొరపెట్టుకునేవారంతా అసత్యం అవటం మూలంగా, ముమ్మాటికీ అల్లాహ్‌యే సర్వోన్నతుడు, గొప్పవాడు అవటం మూలంగా ఇలా జరుగుతోంది.

ذٰلِكَ بِاَنَّ اللّٰهَ هُوَ الْحَقُّ وَاَنَّ مَا يَدْعُوْنَ مِنْ دُوْنِهٖ
هُوَ الْبَاطِلُ وَاَنَّ اللّٰهَ هُوَ الْعَلِىُّ الْكَبِيْرُ ﴿٦٢﴾

**63** ఏమిటీ, అల్లాహ్ ఆకాశం నుంచి వర్షపు నీరును కురిపించటాన్ని, ఆపైన భూమి పచ్చగా కళకళలాడటాన్ని నువ్వు చూడటం లేదా? నిస్సందేహంగా అల్లాహ్ దయాశీలి. సర్వాన్నీ ఎరిగినవాడు.[84]

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ اَنْزَلَ مِنَ السَّمَآءِ مَآءً فَتُصْبِحُ
الْاَرْضُ مُخْضَرَّةً ۗ اِنَّ اللّٰهَ لَطِيْفٌ خَبِيْرٌ ﴿٦٣﴾

---

లేదు. ఆ మేరకు అల్లాహ్ అనుమతించటం వల్లనే అతను ప్రతీకారం తీర్చుకున్నాడు. కాబట్టి భవిష్యత్తులో కూడా అల్లాహ్ అతనికి అండగా ఉంటాడు.

81. అయితే క్షమాభిక్ష మరింత మంచి విషయమని మళ్లీ వెంటనే చెప్పబడింది. అల్లాహ్ మన్నించి, మేలుచేసి వదలిపెట్టేవాడు గనక మీరు కూడా ఆ మన్నింపుల వైఖరిని అలవరచుకోవటం ఉత్తమం అని భావం.

మరో అర్థం: జరిగిన అన్యాయానికి బదులు తీర్చుకునే అనుమతి ధర్మంలో ఇవ్వబడినందున బదులు తీర్చుకోవటంలో తప్పులేదు. పైగా ఇది మన్నించదగిన విషయమే. దీనిపై పీడిత వ్యక్తిని నిలదీసి అడగటం జరగదు.

82. అంటే రేయి నుంచి పగటినీ, పగటి నుంచి రేయినీ తీసేంతటి శక్తిగల దేవునికి బలమదాంధులను శిక్షించటం ఏమాత్రం కష్టంకాదు. ఆయన దుర్మార్గులను తప్పకుండా దండిస్తాడు.

83. ఇదంతా ఎందుకు జరుగుతుందంటే ఆయన ధర్మం సత్యం గనక, ఆయన ఆరాధన సత్యం గనక, ఆయన వాగ్దానాలు సత్యమైనవి గనక, తనను నమ్ముకున్న సజ్జనులకు ఆయన సహాయపడటం సత్యం గనక!

అల్లాహ్ తన ఉనికి విషయంలోనూ, తన గుణగణాల విషయంలోనూ, తన కార్యాచరణ విషయంలోనూ ఆసాంతం సత్యం.

**64** భూమ్యాకాశాలలో వున్న సమస్తం ఆయనదే. నిశ్చయంగా అల్లాహ్‌యే అక్కర లేనివాడు, ప్రశంసనీయుడు.[85]

لَهٗ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ ۭ وَاِنَّ اللّٰهَ لَهُوَ الْغَنِيُّ الْحَمِيْدُ ۝۶۴

**65** ఏమిటీ, అల్లాహ్ భూమండలంలో ఉన్న సమస్తాన్నీ, ఆయన ఆదేశాను సారమే సముద్రంలో నడిచే ఓడలను మీకు వశపరచటాన్ని మీరు చూడటం లేదా?[86] తన అనుజ్ఞ కానంత వరకూ భూమిపై విరుచుకుపడకుండా ఉండేలా ఆయనే ఆకాశాన్ని నిలిపి ఉంచాడు.[87] నిశ్చ యంగా అల్లాహ్ మనుషులపై దయార్ద్రత కలవాడు, జాలి చూపేవాడు.[88]

اَلَمْ تَرَ اَنَّ اللّٰهَ سَخَّرَ لَكُمْ مَّا فِي الْاَرْضِ وَالْفُلْكَ تَجْرِيْ فِي الْبَحْرِ بِاَمْرِهٖ ۭ وَيُمْسِكُ السَّمَاۗءَ اَنْ تَقَعَ عَلَي الْاَرْضِ اِلَّا بِاِذْنِهٖ ۭ اِنَّ اللّٰهَ بِالنَّاسِ لَرَءُوْفٌ رَّحِيْمٌ ۝۶۵

84. **'లతీఫ్'** ( **لَطِيْفٌ** ) అంటే సూక్ష్మాతిసూక్ష్మమైన విషయాన్ని సయితం గమనించేవాడు, పసిగట్టేవాడు, నిఘావేసి ఉంచేవాడు అని భావం. ఆయన జ్ఞానపరిధి బహువిస్తృత మైనది. అది ప్రతి చిన్న విషయాన్ని కూడా ఆవరించి ఉంది. ఈ పదానికి మృదు స్వభావి అన్న అర్థం కూడా ఉంది. తన దాసులకు ఉపాధిని సమకూర్చే విషయంలో ఆయన సూక్ష్మద్రష్ట. జాలి కలవాడు. అదే సమయంలో తన దాసుల అక్కరలేమిటో కూడా ఆయనకు తెలుసు.

85. సృష్టించటం రీత్యానూ, యాజమాన్యం దృష్ట్యానూ, ఏలటం దృష్ట్యా కూడా ఆయనే సర్వాధిపతి. అందువల్ల సృష్టితాలన్నీ ఆయనపై ఆధారపడి ఉన్నాయి. ఆయన మాత్రం ఎవరిపైనా ఆధారపడి లేడు. ఆయన అక్కరలేనివాడు. సకల ప్రవీణతలకు, సర్వాధికారాలకు మూలం అయిన అస్థిత్వం ఎట్టి పరిస్థితిలోనూ స్తుతించదగినదై ఉంటుంది.

86. ఉదాహరణకు భూమిలో సంచరించే జంతువులు, ప్రవహించే కాలువలు, భూమిలో నిక్షిప్తమై ఉన్న ఖనిజాలు, చమురు నిల్వాలు, సహజవాయువులు, ఇంకా ఎన్నో ప్రయోజనాలతో కూడుకున్న వస్తువులు – ఇవన్నీ మానవునికి అధీనం చేయబడ్డాయి. అతను వాటిని అనుభవిస్తూ ప్రగతిని సాధిస్తున్నాడు.

87. ఆయన గనక తలిస్తే ఆకాశం విరుచుకుపడి భూమి యందలి వస్తువులు, జీవులు సర్వనాశనం కావచ్చు. కాని అలా జరగకుండా ఆయన ఆకాశాన్ని పైన నిలిపి ఉంచాడు. అయితే ప్రళయదినాన దేవుని పథకం ప్రకారం ఆకాశం కూడా బ్రద్దలై పోతుంది.

**66** మీకు జీవనం ప్రసాదించినవాడు ఆయనే. మరి ఆయనే మీకు మరణం వొసగుతాడు. మళ్లీ ఆయనే మిమ్మల్ని తిరిగి బ్రతికిస్తాడు. అయినా మానవుడు మేలును మరిచేవాడే.[89]

وَهُوَ الَّذِي أَحْيَاكُمْ ثُمَّ يُمِيتُكُمْ ثُمَّ يُحْيِيكُمْ ۗ إِنَّ الْإِنسَانَ لَكَفُورٌ ﴿٦٦﴾

**67** ప్రతి అనుచర సమాజానికీ మేము ఒక ఆరాధనా పద్ధతిని నిర్ధారించి ఉన్నాము. దాన్ని వారు పాటిస్తున్నారు.[90] కాబట్టి వారు ఈ విషయంలో నీతో గొడవపడ కూడదు.[91] నువ్వు మాత్రం ప్రజలను నీ ప్రభువు వైపు పిలువు. నిశ్చయంగా నువ్వు సన్మార్గాన ఉన్నావు.[92]

لِّكُلِّ أُمَّةٍ جَعَلْنَا مَنسَكًا هُمْ نَاسِكُوهُ ۖ فَلَا يُنَازِعُنَّكَ فِي الْأَمْرِ ۚ وَادْعُ إِلَىٰ رَبِّكَ ۖ إِنَّكَ لَعَلَىٰ هُدًى مُّسْتَقِيمٍ ﴿٦٧﴾

88. అందుకే ఆయన భూమండలంలోని సమస్త వస్తువులను మానవుల స్వాధీనంలో ఉంచటంతోపాటు, ఆకాశాన్ని క్రిందపడకుండా నిలిపి ఉంచాడు.

89. మానవ స్వభావం ఎటువంటిదో ఇక్కడ చెప్పబడింది. ఇన్ని మేళ్లను పొందిన తరువాత కూడా అతడు తన సృష్టికర్తను విస్మరిస్తాడు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపే బదులు ఇతరుల ముందు మోకరిల్లుతాడు. అయితే మానవుల్లో అందరూ అలాంటివారై ఉండరు.

90. అంటే మేము ప్రతి కాలంలోనూ, ఆయా ప్రజల కోసం ఒక్కో షరీయతును (ధర్మ శాస్త్రాన్ని) నిర్ణయించాము. జీవన ధర్మం అందరిదీ మౌలికంగా ఒక్కటే అయినప్పటికీ కొన్ని కొన్ని విషయాలలో వైవిధ్యం ఉంటుంది. ఉదాహరణకు : దైవప్రవక్త హజ్రత్ మూసా (అలైహిస్సలాం) కోసం తౌరాతు గ్రంథాన్ననుసరించి షరీయతును ఆమోదించటం జరిగింది. ఇంజీలు (బైబిలు) హజ్రత్ ఈసా (ఏసుక్రీస్తు) విధానంగా ఉండేది. కాగా; ఇప్పుడు ముహమ్మదు (స) అనుచర సమాజం కోసం ఖుర్ఆన్ను జీవన సంవిధానంగా ఖరారు చేయటం జరిగింది.

91. అంటే (ఓ ముహమ్మద్ – స!) దేవుడు నీకు ప్రసాదించిన జీవన సంవిధానం (షరీయతు) కూడా లోగడ ప్రసాదించబడిన ధర్మశాస్త్రాల సూత్రాల కనుగుణంగానే ఉంది. కాబట్టి పూర్వపు ధర్మశాస్త్రాల అవలంబీకులు ఇప్పుడు నీ షరీయతును విశ్వసించాలి. అంతేగాని వారు అనవసరంగా పేచీ పెట్టకూడదు.

92. (ఓ ముహమ్మద్!) నువ్వు వారి ఆక్షేపణలను లెక్కచేయకు. వారిని నీ ప్రభువు

وَإِن جَادَلُوكَ فَقُلِ اللَّهُ أَعْلَمُ بِمَا تَعْمَلُونَ ﴿٦٨﴾

**68** ఒకవేళ అప్పటికీ వాళ్లు నీతో వాదులాటకు దిగితే వారికి ఇలా చెప్పెయ్యి: "మీ కర్మల సంగతి అల్లాహ్‌కు బాగా తెలుసులెండి.

اللَّهُ يَحْكُمُ بَيْنَكُمْ يَوْمَ الْقِيَامَةِ فِيمَا كُنتُمْ فِيهِ تَخْتَلِفُونَ ﴿٦٩﴾

**69** "మీరు విభేదించుకుంటున్న విషయాల గురించి అల్లాహ్ ప్రళయదినాన మీ మధ్య తప్పకుండా తీర్పు చేస్తాడు."[93]

أَلَمْ تَعْلَمْ أَنَّ اللَّهَ يَعْلَمُ مَا فِي السَّمَاءِ وَالْأَرْضِ
إِنَّ ذَٰلِكَ فِي كِتَابٍ إِنَّ ذَٰلِكَ عَلَى اللَّهِ يَسِيرٌ ﴿٧٠﴾

**70** భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువు గురించీ అల్లాహ్‌కు తెలుసన్న సంగతి నీకు తెలియదా? అంతా ఒక గ్రంథంలో వ్రాయబడి ఉంది. నిస్సందేహంగా ఈ విషయం అల్లాహ్‌కు చాలా సులువైనది.[94]

---

మార్గంవైపు పిలుస్తూ ఉండు. ఎందుకంటే ఇప్పుడు రుజుమార్గంపై ఉన్నది నువ్వు మాత్రమే. వెనుకటి షరీయతులు (ధర్మశాస్త్రాలు, ఆరాధనా నియమాలు) రద్దు చేయబడ్డాయి.

93. బోధపరిచిన తరువాత కూడా వారు తమ పిడివాదాన్ని విడనాడకపోతే వాళ్ల వ్యవహారాన్ని దైవాధీనం చేసెయ్యి. మీ మధ్య గల అభిప్రాయభేదాలకు సంబంధించి అల్లాహ్ మాత్రమే అంతిమ నిర్ణయం చేస్తాడు. ఏది సత్యమో, ఏది అసత్యమో తీర్పుదినాన తేలిపోతుంది. దానిప్రకారమే బహుమానం వొసగటమో, శిక్ష విధించటమో జరుగుతుంది.

94. ఈ వాక్యంలో అల్లాహ్ తన అసాధారణ ప్రజ్ఞాపాటవాలను గురించి ప్రస్తావించాడు. తన సృష్టితాలు – భావిలో – ఏమేమి చేయనున్నామో, వారి గతి ఏం కానున్నదో ఆయనకు ముందు నుంచే తెలుసు. అందుకే ఆయన తన జ్ఞానంతో ఆ విషయాలను ముందుగానే గ్రంథస్థం చేశాడు. ఈ సంగతి మానవులకు ఎంతగా కష్టతరం అనిపించినా ఆ విధాతకు మాత్రం ఇది చాలా తేలిక. ఈ 'విధివ్రాత'పై విశ్వాసం కలిగి ఉండటం కూడా అవసరమే. ఆ విషయమే హదీసులో ఇలా అనబడింది : "అల్లాహ్ భూమ్యాకాశాలను సృష్టించక యాభైవేల సంవత్సరాల క్రితమే – ఆయన సింహాసనం (అర్ష్) నీటిపై ఉండగానే – ఆయన తన సృష్టితాల విధివ్రాతను లిఖించాడు." (సహీహ్ ముస్లిం – కితాబుల్ ఖద్ర్). సునన్‌లోని ఉల్లేఖనంలో ఇలా ఉంది : "అల్లాహ్ అన్నిటికన్నా ముందు 'కలం' సృష్టించాడు. తరువాత దానికి 'వ్రాయి' అని ఆజ్ఞాపించాడు. 'ఏం వ్రాయను?' అంది అది. 'జరగబోయేదంతా వ్రాయి' అని ఆయన ఆజ్ఞాపించాడు. అందువల్ల అది ప్రళయదినం వరకూ జరగ

وَيَعْبُدُونَ مِن دُونِ اللَّهِ مَا لَمْ يُنَزِّلْ بِهِ سُلْطَانًا وَمَا لَيْسَ لَهُم بِهِ عِلْمٌ ۗ وَمَا لِلظَّالِمِينَ مِن نَّصِيرٍ ﴿٧١﴾

**71** వారు అల్లాహ్‌ను వదలి ఆయన ఏ ప్రమాణాన్నీ అవతరింప జెయ్యనటువంటి వాటిని పూజిస్తున్నారు. పోనీ వారికైనా తత్సంబంధిత జ్ఞానం ఏదైనా ఉందా అంటే అదీ లేదు.[95] దుర్మార్గులను ఆదుకునే వాడెవడూ లేడు.

وَإِذَا تُتْلَىٰ عَلَيْهِمْ آيَاتُنَا بَيِّنَاتٍ تَعْرِفُ فِي وُجُوهِ الَّذِينَ كَفَرُوا الْمُنكَرَ ۖ يَكَادُونَ يَسْطُونَ بِالَّذِينَ يَتْلُونَ عَلَيْهِمْ آيَاتِنَا ۗ قُلْ أَفَأُنَبِّئُكُم بِشَرٍّ مِّن ذَٰلِكُمُ ۗ النَّارُ وَعَدَهَا اللَّهُ الَّذِينَ كَفَرُوا ۖ وَبِئْسَ الْمَصِيرُ ﴿٧٢﴾

**72** వారి ముందు స్పష్టమైన మా ఆయతులను చదివి వినిపించినప్పుడు అవిశ్వాసుల ముఖాలపై తిరస్కార (అసహన) భావం తొంగిచూడటాన్ని నువ్వు గ్రహిస్తావు. మా ఆయతులను చదివి వినిపించే వారిపై విరుచుకుపడతారేమో అన్నట్లు వారు కనిపిస్తారు.[96] (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు: "దీనికన్నా దారుణమైన సమాచారాన్ని నేను మీకు తెలుపనా?! అదే నరకాగ్ని. దాని గురించి అల్లాహ్ అవిశ్వాసులకు వాగ్దానం చేసి ఉన్నాడు.[97] అది బహుచెడ్డ గమ్యస్థానం."

బోయేదంతా వ్రాసేసింది" అని మహాప్రవక్త (సఅసం) తెలియజేశారు (అబూదావూద్ – కితాబుస్సున్న; తిర్మిజీ – అబ్వాబుల్ ఖద్ర్ వ తఫ్సీర్ సూరతు నూన్; ముస్నదె అహ్మద్ – 5/317).

95. అంటే వారు చేస్తున్న షిర్కుకు ఆధారంగా ఆకాశగ్రంథాలలో ఏదైనా ఆధారం ఉందా అంటే అదీలేదు. పోనీ, దైవేతర దాస్యానికి సంబంధించి తమ బుద్ధీ జ్ఞానాల ఆధారం గానయినా వారు ఏదన్నా నిదర్శనం చూపగలుగుతున్నారా? అంటే అదీ లేదు.

96. ఒక్కోసారి వారు దూషిస్తారు. ఒక్కోసారి సందేశ ప్రదాతపై చెయ్యిచేసుకోవటానికి కూడా వెనుకాడరు. దేవుని ఏకత్వం (తౌహీద్) గురించిన మాటలు ముష్రిక్కులకు, మార్గభ్రష్టులకు ఎన్నటికీ సహించవు. ఆ అసహనం, ఆగ్రహం, ఆవేశం వారి ముఖాలపై కొట్టొచ్చినట్టే కనిపిస్తుంది. దాన్ని వారు అదుపు చేసుకోలేక ఒక్కోసారి మాటల ద్వారా, చేతల ద్వారా కూడా వ్యక్తపరుస్తుంటారు.

అంతెందుకు, నేటి 'బిద్అతీలనే' చూడండి–ఖుర్ఆన్ హదీసుల ఆధారంగా వారి

يَا أَيُّهَا النَّاسُ ضُرِبَ مَثَلٌ فَاسْتَمِعُوا لَهُ ۚ إِنَّ الَّذِينَ
تَدْعُونَ مِن دُونِ اللَّهِ لَن يَخْلُقُوا ذُبَابًا وَلَوِ
اجْتَمَعُوا لَهُ ۖ وَإِن يَسْلُبْهُمُ الذُّبَابُ شَيْئًا لَّا يَسْتَنقِذُوهُ
مِنْهُ ۚ ضَعُفَ الطَّالِبُ وَالْمَطْلُوبُ ﴿٧٣﴾

**73** ఓ ప్రజలారా! ఒక ఉపమానం వివరించబడుతోంది – శ్రద్ధగా వినండి. అల్లాహ్‌ను వదలి మీరు ఎవరెవరినయితే మొరపెట్టుకుంటున్నారో, వారంతా ఏకమైనా[98] – ఒక్క ఈగను కూడా సృష్టించ లేరు. పైగా ఈగ వారి నుంచి ఏదైనా వస్తువును ఎగరేసుకుపోతే వారు దాన్ని కూడా దాని నుండి విడిపించుకోలేరు.[99] అర్థించేవాడూ,[100] అర్థించబడేవాడూ – ఇరువురూ బలహీనులే.

అపమార్గాన్ని నిరూపించే ప్రయత్నం ఎవరు చేసినా వారు ఓర్చుకోలేరు. ఆగ్రహంతో చిందులేస్తారు. సన్మార్గగాముల్ని హింసించటానికి కూడా సంసిద్ధులవుతారు (ఫత్‌హుల్ ఖదీర్).

97. దైవవాక్యాలు విన్నంతనే మీ ముఖాలు రంగులు మారిపోతున్నాయే! ఒకానొక ఘడియ రానున్నది. మీరు గనక మీ వైఖరిని మార్చుకుని, పశ్చాత్తాపం చెందకపోతే ఇంతకన్నా ఘోరమైన స్థితికి లోనవవలసి ఉంటుంది. మీరు నరకాగ్నికి ఆహుతి కాకతప్పదు. దాని గురించి అల్లాహ్ అవిశ్వాసులకు, బహుదైవోపాసకులకు వాగ్దానం చేసి ఉన్నాడు.

98. బూటకపు దైవాల శక్తి ఏపాటిదో ఇక్కడ తెలుపటం జరిగింది. వారంతా కలసి ఒక ఈగను సృష్టించాలనుకున్నా, ఆ పని చేయలేరు. అయినప్పటికీ మీరు వారినే పూజి స్తున్నారా? వారు మీ అక్కరలు తీర్చగలరని నమ్ముతున్నారా? మీ ఆలోచనను ఏమనాలి? ఈ ఆయతును బట్టి అర్థమయ్యేదేమిటంటే ఆ కాలంలో జనులు కేవలం రాతి విగ్రహాలను మాత్రమేగాక బుద్ధీ వివేచనలుగల మానవులను కూడా ఆరాధ్య దేవుళ్లుగా చేసుకున్నారు. అంటే దేవుని ఆ సజ్జనులు చనిపోయిన తరువాత వారిని దైవానికి భాగస్వాములుగా చేసుకున్నారు. వారు కేవలం రాతి బొమ్మలను పూజించి ఉన్నట్లయితే, 'ఒక్క ఈగనయినా సృష్టించలేర'న్న సవాలు చేయబడేది కాదు.

99. ఇది వారి అశక్తతను, అసహాయ స్థితిని వ్యక్తపరుస్తోంది. ఈగను సృష్టించటం సుదూర విషయం, ఈగ వారి నుంచి తన్నుకుపోయిన వస్తువును సయితం దాని నోటిలో నుంచి లాక్కోలేరు.

100. అర్థించేవారు అంటే బూటకపు దైవాలను పూజించేవారు. అర్థించబడేవారంటే వారు పూజించే బూటకపు దేవుళ్లు. ఒక హదీసె ఖుద్సీలో బూటకపు దైవాల నిస్సహాయస్థితి ఈ విధంగా తెలుపబడింది – అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "నా మాదిరిగా సృష్టిం

74 వీళ్లు అల్లాహ్ స్థాయికి అనుగుణంగా ఆయన గొప్పదనాన్ని గుర్తించనే లేదు.[101] అల్లాహ్ మహా శక్తిశాలి, ప్రాబల్యం కలవాడు.

مَا قَدَرُوا اللّٰهَ حَقَّ قَدْرِهٖ ۭ اِنَّ اللّٰهَ لَقَوِيٌّ عَزِيْزٌ ۝۷۴

75 అల్లాహ్‌యే దైవదూతలలో నుంచి, మానవులలో నుంచి తన సందేశహరులను ఎంపిక చేసుకుంటాడు.[102] నిశ్చయంగా అల్లాహ్ అంతా వింటాడు, అన్నీ చూస్తాడు.[103]

اَللّٰهُ يَصْطَفِيْ مِنَ الْمَلٰۗىِٕكَةِ رُسُلًا وَّمِنَ النَّاسِ ۭ اِنَّ اللّٰهَ سَمِيْعٌۢ بَصِيْرٌ ۝۷۵

చదలిచే వాడికన్నా దుర్మార్గుడు ఎవడుంటాడు? నిజంగానే వాడిలో అంతటి శక్తి ఉంటే వాడు ఒక రేణువును లేక గోధుమ గింజనే సృష్టించి చూపాలి." (సహీహ్ బుఖారీ – కితాబుల్లిబాస్).

101. అందుకే వారు నిస్సహాయులైన ఆయన దాసులను ఆయనకు సహవర్తులుగా, భాగస్వాములుగా నిలబెడుతున్నారు. అల్లాహ్ శక్తియుక్తులను, ఆయన ఆగ్రహానుగ్రహాలను, ఆయన అసాధారణ ప్రజ్ఞాపాటవాలను వారు సరిగ్గా గ్రహించగలిగితే వారెన్నటికీ దైవత్వంలో భాగస్వామ్యం కల్పించరు.

102. అల్లాహ్ మానవుల్లో నుంచి తాను కోరిన వారిని ప్రవక్తలుగా, సందేశహరులుగా ఎన్నుకున్నాడంటే విషయం సులభంగానే అర్థమవుతోంది. కాని దైవదూతలను సందేశహరులుగా ఎందుకు ఎన్నుకుంటాడు? వారి ద్వారా తన సందేశాన్ని ఎలా విధిస్తాడు? అన్న సందేహం కలగవచ్చు. కాని దేవుడు తన సందేశాన్ని మానవత వరకు చేరవేయటానికీ, తన ప్రణాళికను వివిధ జాతులపై అమలుపరచటానికి తన దూతలను (ఫరిష్తాలను) కూడా నియుక్తుల్ని చేస్తాడు. ఉదాహరణకు : ఆయన హజ్రత్ జిబ్రయీల్ (అలైహిస్సలాం)కు ప్రవక్తల వరకు సందేశాన్ని చేరవేసే బాధ్యతను అప్పగించారు. అలాగే దైవాజ్ఞలను ధిక్కరించిన కొన్ని మానవజాతులను శిక్షించటానికి కొంతమంది దైవదూతలను ప్రత్యేకంగా నియమించాడు.

మొత్తానికి దేవుని సందేశహరులుగా తమ బాధ్యతను నిర్వర్తించిన ఆ ప్రవక్తలు, దైవ దూతలు కూడా దేవుని దాసులే. దేవుడు వారిని తన కార్యం కోసం ఎన్నుకున్నాడంటే ఎందుకు ఎన్నుకున్నట్టు? మానవజాతిని సంస్కరించి, వారిని దైవవిధేయులుగా తీర్చిదిద్దడానికే ఈ మహత్తర ఏర్పాటు చేశాడు. అంతేగాని ఆ సందేశవాహకులను తన భాగస్వాములుగా పరిగణించి, పూజించమని మాత్రం కాదు. **'రుసుల్'** (رُسُل) అనేది 'రసూల్'కు బహువచనం. సందేశహరుడు అని దాని అర్థం.

**76** వారికి ముందున్నదీ, వారికి వెనుక ఉన్నదీ – అంతా ఆయనకు తెలుసు. సమస్త వ్యవహారాలు అల్లాహ్ వైపుకే మరలించబడతాయి.[104]

يَعْلَمُ مَا بَيْنَ أَيْدِيهِمْ وَمَا خَلْفَهُمْ وَإِلَى اللَّهِ تُرْجَعُ الْأُمُورُ ٧٦

**77** ఓ విశ్వాసులారా! రుకూ, సజ్దాలు చేస్తూ ఉండండి.[105] మీ ప్రభువును ఆరాధిస్తూ ఉండండి. మంచిపనులు చేస్తూ ఉండండి – తద్వారా మీరు సఫలీ కృతులవుతారు.[106]

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا ارْكَعُوا وَاسْجُدُوا وَاعْبُدُوا رَبَّكُمْ وَافْعَلُوا الْخَيْرَ لَعَلَّكُمْ تُفْلِحُونَ ۩ ٧٧

**78** అల్లాహ్ (ప్రసన్నత) కోసం పాటు పడవలసిన విధంగా పాటుపడండి.[107]

وَجَاهِدُوا فِي اللَّهِ حَقَّ جِهَادِهِ هُوَ اجْتَبَاكُمْ وَمَا

103. ఆయన తన దాసుల గోడును వింటాడు. వారి అక్కరలను ఆయన గమనిస్తూ ఉన్నాడు. వారిలో ఎవరు ప్రవక్త పదవికి అర్హులో ఆయనకు తెలుసు. "తన సందేశాన్ని ఎవరి ద్వారా అందజేయాలో, ఎలా అందజేయాలో అల్లాహ్‌కు బాగా తెలుసు" (అల్ అన్ఆమ్–124) అన్న ఆయతు కూడా ఈ సందర్భంగా గమనించదగినది.

104. సమస్త కార్యాలకు కేంద్రబిందువు అల్లాహ్‌యే అయినప్పుడు మనిషి ఆయన ఆదేశాలను ధిక్కరించి ఎక్కడికెళ్తాడు? ఆయన శిక్షనుంచి ఎలా తప్పించుకుంటాడు? అలాంటప్పుడు అతను ఈ పలాయన వాదాన్ని అనుసరించేబదులు దైవవిధేయతా విధానాన్ని అవలంబించి ఆయన ప్రసన్నతను చూరగొనటం శ్రేయస్కరం కాదా? ఆ మాటే దీని తరువాతి ఆయతులో చెప్పబడింది.

105. అంటే షరీయతులో నిర్ధారించబడిన నమాజును చేస్తూ ఉండండి. తరువాతి వాక్యంలో ఆరాధన గురించి కూడా ప్రస్తావించబడింది. ఆరాధనలో నమాజు కూడా అంతర్భాగమే. అయితే నమాజుకు గల ప్రాముఖ్యత దృష్ట్యా దాని గురించి ప్రత్యేకంగా ఆజ్ఞాపించటం జరిగింది.

106. అంటే దైవారాధన మరియు సత్కార్యాలలోనే సాఫల్యం ఇమిడి ఉందన్నమాట! దైవారాధన, దైవవిధేయతల నుండి ముఖం త్రిప్పుకుని, ప్రజోపయోగపనులను విస్మరించి అభివృద్ధిపేరిట పొద్దస్తమానం పదార్థపూజలో తలమునకలై ఉన్నవారు కృతార్థులు కాలేరు.

107. అరబీలో **'జిహాద్'** (جهاد) అనే పదం ఉంది. ఇక్కడ జిహాద్ అంటే అర్థం దైవధర్మ ఉన్నతికోసం అవిశ్వాసులతో, ముష్రిక్కులతో చేసే ధర్మయుద్ధం అని కొందరు భావించారు. అయితే ఇక్కడ ఈ పదం యుద్ధానికి వర్తించదనీ, దేవుడు చేయమని

جَعَلَ عَلَيْكُمْ فِي الدِّيْنِ مِنْ حَرَجٍ ۭ مِلَّةَ اَبِيْكُمْ
اِبْرٰهِيْمَ ۭ هُوَ سَمّٰىكُمُ الْمُسْلِمِيْنَ ڏ مِنْ قَبْلُ وَفِيْ هٰذَا
لِيَكُوْنَ الرَّسُوْلُ شَهِيْدًا عَلَيْكُمْ وَتَكُوْنُوْا شُهَدَاۗءَ عَلَي
النَّاسِ ښ فَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ وَاعْتَصِمُوْا
بِاللّٰهِ ۭ هُوَ مَوْلٰىكُمْ ۚ فَنِعْمَ الْمَوْلٰى وَنِعْمَ النَّصِيْرُ ۧ ⑦⑧

ఆయన మిమ్మల్ని ఎన్నుకున్నాడు. ధర్మం విషయంలో ఆయన మీపై ఎలాంటి ఇబ్బందినీ ఉంచలేదు.[108] మీ పితా మహుడైన ఇబ్రాహీము (అలైహి స్సలాం)[109] ధర్మానికి కట్టుబడి ఉండండి. ఈ ఖుర్ఆన్‌కు పూర్వం కూడా ఆయన (అల్లాహ్)[110] మిమ్మల్ని 'ముస్లింలు'గానే నామకరణం చేశాడు. మరి ఇందులో కూడా (మీ పేరు అదే). దైవప్రవక్త మీపై సాక్షిగా, మీరు మానవాళిపై సాక్షులుగా ఉండటానికి[111] (ఈ విధంగా చేయ బడింది). కనుక మీరు నమాజును నెలకొల్పండి, జకాతును చెల్లించండి, అల్లాహ్‌ను స్థిరంగా ఆశ్రయించండి. ఆయనే మీ సంరక్షకుడు! (ఆయన) ఎంత చక్కని సంరక్షకుడు! మరెంత చక్కని సహాయకుడు!

చెప్పిన వాటిని చేయటం, నిషేధించిన వాటికి దూరంగా ఉండటం అన్న భావంలోనే ఇలా అనబడిందనీ, చెడుల వైపుకు ప్రేరేపించే మనసు (నఫ్సె అమ్మారా)ను, షైతానును ప్రతిఘటించటం కూడా ఇందులో చేరి ఉందని మరికొంతమంది విద్వాంసులు అభిప్రాయపడ్డారు. కాగా; సత్యానికి ఉన్నతిని కల్పించటానికి, అసత్యం మెడలు వంచటానికి జరిగే ప్రయత్నాలన్నీ ఈ జిహాద్ పరిధిలోకి వస్తాయని ఇంకా కొంతమంది వ్యాఖ్యాతలు తలపోస్తున్నారు.

108. అంటే మానవ మాత్రులు భరించలేనంతటి క్లిష్టతరమైన బాధ్యతలను దేవుడు మీపై మోపలేదు (కాకపోతే కాస్తో కూస్తో కష్టం అన్ని చోట్లా ఉంటుంది). పైగా వెనుకటి షరీయతులలో ఉండే ఎన్నో కఠినమైన విధులను దేవుడు రద్దుపరిచాడు. ముహమ్మద్ (సఅసం) అనుచర సమాజం కోసం ఎన్నో సౌలభ్యాలను కూడా కల్పించాడు. ఆ సౌలభ్యాలు పూర్వం గతించిన సమాజాల వారికి ఉండేవి కావు.

109. హజ్రత్ ఇబ్రాహీం తన భార్య అయిన హాజిరాను, కుమారుడు ఇస్మాయీల్‌ను మక్కాలో వసింపజేశారు. తద్వారా అక్కడ ఒక నవతరం ఉనికిలోకి వచ్చింది. అరబ్బులు హజ్రత్ ఇస్మాయీల్(అ) సంతతి నుండి వచ్చినవారు. ఆ రకంగా ఇస్మాయీల్ తండ్రి అయిన ఇబ్రాహీం అరబ్బులకు పితామహుడుగా పరిగణించబడేవారు. అదే

సమయంలో అరబ్బేతరులు కూడా ఇబ్రాహీం అసాధారణ త్యాగాల కారణంగా ఆయన్ని ఎంతగానో గౌరవించేవారు. ఆ విధంగా ఆయన అందరికీ తండ్రిలాంటివారే. అయితే అంతిమ దైవప్రవక్త అయిన ముహమ్మద్ (స) అరబ్బు అయినందున ఆయన (స)కు హజ్రత్ ఇబ్రాహీం (అ) 'పితామహుడు' అవుతారు. కాబట్టి ముహమ్మద్ (స) అనుచర సమాజం కోసం కూడా ఆయన పితామహుడే. కనుక, అల్లాహ్ మీకోసం సమ్మతించి, ఆమోదించిన ఇస్లాం ధర్మం మీ పితామహుడైన ఇబ్రాహీం అవలంబించిన జీవన ధర్మమేనని, మీరు కూడా ఈ ధర్మాన్నే అనుసరించండని యిక్కడ ఉపదేశించ బడింది.

110. ఇక్కడ **'హువ'** ( هُوَ ) (ఆయన) అనే పదం అల్లాహ్‌కు వర్తిస్తుందా లేక ఇబ్రాహీం (అలైహిస్సలాం)కు వర్తిస్తుందా? అన్నది ఒక ప్రశ్న. కొంతమంది 'ఇబ్రాహీం' అని అభిప్రాయపడ్డారు. అంటే ఈ ఖుర్ఆన్ గ్రంథం అవతరించకపూర్వం ఇబ్రాహీంగారే మీకు 'ముస్లిం' అనే పేరు పెట్టారని వారు భావిస్తున్నారు. రెండవ వర్గం వారు 'హువ' (ఆయన) అనే పదాన్ని అల్లాహ్ అన్న భావంలో తీసుకున్నారు.

111. ఈ సాక్ష్యం తీర్పుదినాన తీసుకోబడుతుంది. హదీసులోనూ ఇలాగే ఉంది. వివరాలకు అల్ బఖర సూరా 143వ ఆయతుకు ఇవ్వబడిన సారాంశాన్ని చూడండి.